# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 10-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:58 పేజీలు:4 వెల: రూ.1/-


# నేడు తెలంగాణ కేబినేట్ కీలక భేటీ

## అసెంబ్లీ సమావేశాలు, ధాన్యం కొనుగోళ్లపై చర్చ

## కెసిఆర్ అధ్యక్షతన సాయంత్రం ప్రగతి భవన్‌లో సమావేశం

హైదరాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): తెలంగాణ కేబినెట్ శనివారం సాయంత్రం 5 గంటలకు సమావేశం కానుంది. ఈ భేటీలో అసెంబ్లీ సమావేశాలు, ధాన్యం కొనుగోళ్లపై చర్చించనున్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన జిహెచ్ఎంసి బిల్లులపై కేబినెట్‌లో చర్చించనున్నారు. రాష్ట్రంలో కరోనా నేపథ్యంలో రైతులు సాగు చేసిన పంటను యాసంగి కాలానికి ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇప్పుడు వార్షాకాలం సాగు చేసిన పంటలు కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా ఐదువేలకుపైగా కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల్లోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు ఈ యాసంగిలో ఏ పంట వేస్తే లాభం అనేటివంటి అన్ని అంశాలపై సీఎం కేసీఆర్ శనివారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కేబినెట్ సమావేశం జరుగుతుంది. ఈ భేటీలో ప్రధానంగా వ్యవసాయం సంబంధమైనటువంటి అంశాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం. యాసంగిలో అమలు చేయాల్సిన నిర్ణీత పంటసాగు విధానం.. అలాగే ధాన్యం కొనుగోలుపై ఈ కేబినెట్‌లో చర్చించనున్నారు. మరోవైపు హైదరాబాద్ గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ యాక్టు కూడా సవరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ఈ నెల 13న అసెంబ్లీ, 14న శాసనమండలి సమావేశం నిర్వహించబోతోంది. దీనిపై కూడా కేబినెట్‌లో సీఎం కేసీఆర్ చర్చించనున్నారు. హైకోర్టు సూచనల మేరకు మరికొన్ని బిల్లులను కూడా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో కేబినెట్ మీటింగ్ జరగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన చట్టసవరణ బిల్లులను ఆమోదించే అవకాశం ఉంది. యాసంగిలో నిర్ణీత పంటల సాగు విధానం అమలు, ధాన్యం కొనుగోలుపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది.

కేబినెట్ సమావేశం కంటే ముందే.. మధ్యాహ్నం 2:30 గంటలకు వ్యవసాయ, పౌరసరఫరాల శాఖపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించనున్నారు. యాసంగిలో అమలు చేయాల్సిన నిర్ణీత పంటల సాగుపై చర్చించనున్నారు. గ్రామాల్లోనే పంటల కొనుగోలుపై అధికారులకు సీఎం కేసీఆర్ పలు సూచనలు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మక్కలను దిగుమతి చేసుకుంటున్నది. దీని వల్ల దేశంలో మక్కల కొనుగోలుపై ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మక్కల సాగుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# పాశ్వాన్‌కు రాష్ట్రపతి,ప్రధాని నివాళి

## ఇంటికి వెళ్లి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): లోక్‌జనశక్తి పార్టీ నేత, కేంద్రమంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ భౌతికకాయానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నివాళులర్పించారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పాశ్వాన్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఢిల్లీలోని మంత్రి నివాసానికి వెళ్లిన రాష్ట్రపతి ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు. పాశ్వాన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీహార్‌కు చెందిన దళిత నేతగా రామ్‌విలాస్ ఎనలేని కీర్తిని గడించారు. లోక్‌జనశక్తి పార్టీని స్థాపించిన ఆయన.. ఎనిమిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. గత కొన్ని వారాల నుంచి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పాశ్వాన్ ఇటీవలే గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ప్రధాని మోడీ తదితరులు కూడా పాశ్వాన్ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాశ్వాన్ మృతికి సంతాపక సూచంగా రాష్ట్రపతి భవన్, పార్లమెంట్ భవన్ వద్ద జాతీయ జెండాను అవనతం చేశారు.

# తెలంగాణలో బతుకమ్మ చీరల పంపిణీ

## భద్రకాళి అమ్మవారికి తొలిచీర సమర్పించిన మంత్రి సత్యవతి

## పేద మహిళలకు పంపిణీ చేసిన మంత్రులు,ఎమ్మెల్యేలు

## ఊరూరా సందడిగా సాగిన పంపిణీ కార్యక్రమం

## కెసిఆర్ పెద్దన్నలా అందిరికీ అండగా నిలిచారన్న నేతలు

హైదరాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ చీరల పంపిణీ సందడి సాగింది. తొలిరోజు శుక్రవారం ఊరూవాడా మంత్రులు, ఎమ్మెల్యేలు జోరుగా చీరల పంపిణీ సాగింది. సిఎం కెసిఆర్ ఆదేశాలతో పేద మహిళలకు చీరల పంపిణీ సాగింది. దసరా సందర్భంగా పేదల మహిళకు చీరలను పంపిణీ చేసేందుకు అన్ని జిల్లాల్లో కార్యక్రమం కొనసాగింది. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పంపిణీ చేపట్టారు. తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్న బతుకమ్మ చీరలను తొలుత వరంగల్ భద్రకాళి దేవస్థానంలో గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగాలని అమ్మవారిని వేడుకునారు. అమ్మవారికి బతుకమ్మ చీర పెట్టి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దేవస్థానం దగ్గర ఉన్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 24, 27వ వార్డు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండా ప్రకాష్ రావు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్ రాజీవ్ హనుమంతు, కమిషనర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచులకు సీఎం కేసీఆర్ పెద్దన్న అని, అందుకే పండగ పూట మహిళలందరికీ బతుకమ్మ సారెను అందజేస్తున్నారని రాష్ట్ర మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట పట్టణంలోని పలు వార్డులతో పాటు ఆత్మకూరు(ఎస్) మండలంలోనూ బతుకమ్మ చీరల పంపిణీని మంత్రి జగదీశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. స్వయంగా మహిళలకు చీరలు అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే అడగకుండానే వరాలిచ్చే ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. తెలంగాణ పండగలకు పూర్వ వైభవం తెచ్చేలా సీఎం కేసీఆర్ పలు కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్, అమ్మఒడి ఇలా అన్ని పథకాలు సంచాలనాత్మకమేనన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో దేశానికే రాష్ట్రం ఆదర్శమని మంత్రి చెప్పారు. బతుకమ్మ చీరెల పంపిణీ ద్వారా సీఎం కేసీఆర్ మహిళలకు పెద్దన్నలా నిలిచారని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడబిడ్డలు సంతోషంగా జరుపుకోవాలన్నదే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏనుగొండలో ఇంటింటికి తిరిగి బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశిష్, కౌన్సిలర్ కొరవోని వనజ వెంకటయ్య, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ కమిషనర్ సురేందర్ పాల్గొన్నారు. పేదింటి ఆడపడుచులు కూడా బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకు నేందుకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరెలు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఖమ్మం కార్పొరేషన్ 16వ డివిజన్ శాంతినగర్ కళాశాల, రఘునాథపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చీరెల పంపిణీ కార్యక్రమంలో మహిళలకు బతుకమ్మ చీరెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా సుమారు రూ. 317 కోట్లు ఖర్చు పెట్టి కోటి మంది మహిళలకు ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్ర పండుగైన బతుకమ్మ సందర్భంగా ప్రతి ఆడబిడ్డకు ప్రభుత్వ కానుకగా చీరెల పంపిణీ చేస్తుందన్నారు. తొలుత 8 డిజైన్లతో ప్రారంభించి 287 విభిన్నమైన డిజైన్స్ లలో బంగారు, వెండి జరీ అంచులతో తయారీ చేయబడిన పాలిస్టర్ పిలిమెంట్, నూలు చీరెలు అందిస్తున్నారన్నారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు సంతోషంగా జరుపుకునేందుకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరెలు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లాలో బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. టీఎన్జీవోస్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు మంత్రి అల్లోల బతుకమ్మ చీరలను అందజేశారు. పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని మంత్రి సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మహిళ సంతోషంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ అభిమతమని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. ఆలేరు మున్సిపల్ పరిధిలోని సాయిగూడెంలో బతుకమ్మ చీరెలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుల,మతాలకు అతీతంగా చీరెలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి పండుగకు మహిళలకు దుస్తులను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ చీరెలను పంపిణీ చేశామన్నారు. పండుగలకు సీఎం కేసీఆర్ పెద్దన్నల వ్యవహరిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కౌన్సిలర్ దయామని, పీఎసీఎస్ చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు. మహిళల ందరికి పెద్దన్నగా మారి సీఎం కేసీఆర్ బతుకమ్మ పండుగకు చీరెలను ఇస్తున్నారని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకునేందుకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరెలు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.317 కోట్ల వ్యయంతో కోటి మంది మహిళలకు బతుకమ్మ చీరెలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. 18 ఏండ్లు నిండి, తెలుపురంగు రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి చీరెలు అందిస్తున్నామని చెప్పారు.

వరగంల్ కార్పోరేషన్ పరిధిలో బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపి మాలోత్ కవితలు

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

## పోలింగ్ పరిస్థితిని పరిశీలించిన కవిత

## ఓటేసిన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

నిజామాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): నిజామాబాద్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి 50 కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక ముఖ్యమంత్రి కెసిఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఈ ఉప ఎన్నికలో పోటీ చేస్తుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి.సుభాష్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా పోతనకర్ లక్ష్మీనారాయణలు బరిలో ఉన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు గణేశిష్ బిగాల, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఆకుల లలిత, రాజేశ్వర్, వీజీగౌడ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, అంతకు ముందు టీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత కామారెడ్డిలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తో కలిసి స్థానికంగా పోలింగ్ సరళిని పరిశీలించారు. అక్కడి మున్సిపల్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం బోధన్‌కు వెళ్లి, అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. టీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత బోధన్‌లో పర్యటించారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్‌తో కలిసి స్థానికంగా పోలింగ్ సరళిని పరిశీలించారు. బోధన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌ల ఓటింగ్ సరళిని పరిశీలించారు. బోధన్ మండల పరిషత్ కార్యాలయం దగ్గర, టీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి కవితకు ఘన స్వాగతం పలికారు.అధికారులు పోలింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఓటింగ్ సరళి కొనసాగేలా చర్యలు చేపట్టారు.ఈ ఎన్నికల్లో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కూడా ఓటేశారు. ఇదిలా ఉండగా.. ఓటు హక్కు వినయోగించుకునే క్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హైదరాబాద్ క్యాంప్ నుంచి నిజామాబాద్ చేరుకున్నారు. జిల్లా పరిషత్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు కార్పొరేటర్లంతా బయల్దేరి వెళ్లారు. ఎమ్మెల్యేలు గణేశిష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, రాజేశ్వర్ అక్కడికి చేరుకున్నారు. ఇక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 824 మంది మొత్తం ఓటర్లు ఉండగా 24 మంది ఓటర్లకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కోవిడ్ బాధితులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రొటోకాల్‌ను అనుసరించి అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక స్థానిక సంస్థల్లో టీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉండటంతో ఫలితాలు ఏకపక్షంగా వెలువడే అవకాశాలు ఉన్నప్పటికీ, తమ అభ్యర్థి భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా టీఆర్ఎస్ శ్రేణులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. జిల్లాలో అన్ని స్థానిక సంస్థల్లో మొత్తం 824 మంది ఓటర్లు ఉండగా, 413 మంది ఓటర్ల మొదటి ప్రాధాన్యత ఓట్లు దక్కితే విజయం వరిస్తుంది. మొత్తం ఓటర్లు 824లో టీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు 504 మంది ఉన్నారు. దీంతో మ్యాజిక్ ఫిగర్ కంటే ఎక్కువే టీఆర్ఎస్‌కు సొంత బలం ఉంది. దీనికి తోడు మిత్ర పక్షమైన ఎంఐఎం ప్రజాప్రతినిధులు 28 మంది కూడా టీఆర్ఎస్ అభ్యర్థి కవితకు మద్దతుగా ఓటేసే అవకాశాలు ఉన్నాయి. స్వతంత్రులు 66 మంది ఉండగా, ఇప్పటికే దాదాపు అందరూ టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న వారే. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు 142 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటికే 75 మంది కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గులాబీ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం సుమారు 67కు తగ్గింది. అలాగే బీజేపీకి 85 మంది ప్రజాప్రతినిధులు ఉండగా.. ఇప్పటి వరకు 35 మందికి పైగా కారెక్కారు. టీఆర్ఎస్ సొంత బలం, ఎంఐఎం, స్వతంత్రులు, కాంగ్రెస్, బీజేపీల నుంచి వచ్చిన వారితో కలిపి తమకు సుమారు 700 మించి ఓట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు టీఆర్ఎస్ వర్గాలు అంచనా వేసుకుంటున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా బోధన్‌లో ఓటేసిన ఎమ్మెల్యే షకీల్. చిత్రంలో అభ్యర్థి కవిత కూడా ఉన్నారు

# వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు నోబెల్ శాంతి బహుమతి

## ప్రపంచ వ్యాప్తంగా ఆకలి తీర్చే పనిలో విజయం

## శాంతి బహుమతి సందర్భంగా కమిటీ ప్రకటన

న్యూఢిల్లీ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): నోబెల్ కమిటీ శాంతి బహుమతిని ప్రకటించింది. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు నోబెల్ శాంతి పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో నోబెల్ కమిటీ ఈ విషయాన్ని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో డబ్ల్యూఎఫ్‌పీ ప్రపంచ వ్యాప్తంగా ఆకలి చావుల నివారణకు ప్రయత్నించింది. అంతర్ యుద్ధంతో రగులుతున్న ప్రాంతాల్లో శాంతి నెలకొల్పేందుకు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ ఎంతో దోహద పడినట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. యుద్ధ ప్రాంతాల్లో ఆకలిని ఆయుధంగా మార్చుకుని శాంతిని స్థాపించినట్లు కమిటీ చెప్పింది. మానవాళిని పీడిస్తున్న ఆకలి సమస్యను పరిష్కరిం చేందుకు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ అతిపెద్ద కార్యక్రమాన్ని చేపట్టినట్లు నోబెల్ కమిటీ పేర్కొన్నది. 2019లో 88 దేశాల్లో ఆకలితో అలమటిస్తున్న సుమారు వంద మిలియన్ల మందికి ఆహారాన్ని అందించినట్లు నోబెల్ కమిటీ ప్రశంసించింది. కరోనా వైరస్ మహమ్మారి వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆకలి సమస్యలు పెరిగినట్లు కమిటీ పేర్కొన్నది. అయితే ఇటువంటి విపత్కర సమయంలో డబ్ల్యూఎఫ్‌పీ తన సామర్థ్యాన్ని పెంచి సేవలను అందించినట్లు కమిటీ వెల్లడించింది. శాంతి స్థాపన కోసం ఫుడ్ సెక్యూర్టీ కీలకమైందని వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ నిరూపించినట్లు నోబెల్ కమిటీ అభిప్రాయపడింది. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలను కూడా ఈ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యులను చేసేందుకు డబ్ల్యూఎఫ్‌పీ ప్రయత్నించినట్లు నోబెల్ కమిటీ పేర్కొన్నది. కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ రానంత వరకు .. ఆ గందరగోళం నుంచి బయటపడేందుకు ఆహారమే అద్భుమైన మందు అని కమిటీ అభిప్రాయపడింది.

# కీలకమైన వడ్డీరేట్లను యథాతథం

## రెపో రేటును 4 శాతంగా కొనసాగింపు

## ద్రవ్యపరపతిని ప్రకటించిన ఆర్‌బిఐ గవర్నర్

ముంబై,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): కీలకమైన వడ్డీరేట్లను యథాతథంగానే కొనసాగిస్తున్నట్లు ఆర్బిఐ శుక్రవారం ప్రకటించింది. రెపో రేటును 4 శాతంగా, రివర్స్ రెపో రేటును 3.35 శాతంగానే కొనసాగించాలనిర్ణయించినట్లు ఆర్బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. వీటితో పాటు 'అకామిడేటివ్' విధానాన్ని కూడా కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 9.5 శాతం క్షీణించే వీలున్నట్లు ఆర్బీఐ అంచనా వేసింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమ్రాసికానికి ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, అప్పటికి జీడీపీ వృద్ధి రేటు కూడా మెరుగయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. మూడో త్రైమ్రాసికానికి మాత్రం ఆర్థిక కార్యకలాపాలు గాడిలో పడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం, కన్జ్యూమర్ గూడ్స్, విద్యుత్, ఫార్మా రంగాలు అత్యంత వేగంగా కోలుకొనే అవకాశాలున్నాయని దాస్ ప్రకటించారు. ప్రస్తుతం ఆర్బీఐ వద్ద సరిపడా నగదు ఉందని శక్తికాంత్ దాస్ తెలిపారు. ఇకపోతే గృహ, ఆటో రుణాలు తీసుకునేవారికి ఇది చేదువార్తే. ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గించలేదు. వడ్డీ రేటును యథావిధిగా 4 శాతం వద్దే ఉంచింది. ద్రవ్యపరపతి సమీక్ష వివరాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ ఇవాళ వెల్లడించారు. వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న రెపో, రివర్స్ రెపోలో ఎలాంటి మార్పు చేయలేదన్నారు. మూడో త్రైమ్రాసికంలో ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నట్లు కనిపిస్తున్నాయని ఆయన చెప్పారు. సెప్టెంబర్‌లో కూడా ద్రవ్యోల్బణం అధికంగా ఉంటుందని, ఆ తర్వాత క్రమంగా మూడవ, నాల్గవ త్రైమ్రాసికంలో తగ్గుతుందని అంచనా వేశామని అన్నారు. మార్కెట్ ఒడిదుడుకులు ఎదుర్కొనేందుకు ఆర్బీఐ సంసిద్ధంగా ఉందని కూడా ఆయన తెలిపారు. స్వదేశీ లావాదేవీలను వేగంగా నిర్వహించేందుకు ఈ ఏడాది డిసెంబర్ నుంచి రోజంతా ఆర్టీజీఎస్ సేవలను అందించనున్నట్లు శక్తికాంత్ దాస్ తెలిపారు.

# మేడారంలో వనదేవతలకు బతుకమ్మ సారె

## -చీరలు సమర్పించిన మంత్రి సత్యవతి, ఎంపి కవిత

ములుగు,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ప్రఖ్యాతి గాంచిన మేడారం సమ్మక్క, సారమ్మ వనదేవతలకు మొదటి బతుకమ్మ సారెను ప్రభుత్వం తరఫున మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపి మాలోత్ కవితలు సమర్పించారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు సంబురంగా జరుపుకోవాలని సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరెల పంపిణీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదింటి ఆడబిడ్డలకు చీరెల పంపిణీ కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. తొలిరోజు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మహబూబాబాద్ ఎంపీ కవితతో కలిసి అమ్మవార్లకు చీరలు సమర్పించి నూతన ఒరవడికి నాంది పలికారు. అనంతరం జిల్లాలో ఆడబిడ్డలకు చీరెలు పంపిణీ చేశారు. అలాగే వరంగల్ అర్బన్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారికి సైతం బతుకమ్మ చీరెను మంత్రి కానుకగా సమర్పించారు. అనంతరం దేవస్థానం దగ్గర ఉన్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 24, 27వ వార్డు మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో హనుమంతు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాజస్థాన్‌లో రాక్షసకాండ

## పూజారిని సజీవ దహనం చేసిన భూకబ్జాదారులు

## ఘటనపై గ్రామంలో ఉద్రిక్తత

జైపూర్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లో దారుణం జరిగింది. ఓ భూవివాదంలో జరిగిన గొడవ ఓ పూజారి సజీవ దహనానికి కారణమైంది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడైన కైలాశ్ మీనాను అరెస్ట్ చేసిన పోలీసులు మిగతా వారి కోసం గాలిస్తున్నారు. కారౌలి జిల్లా సపోత్రాలోని బుక్నా గ్రామంలో బుధవారం జరిగిందీ ఘటన. కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన ఆలయ పూజారి పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కైలాశ్ మీనాను అరెస్ట్ చేసినట్టు కారౌలి ఎస్పీ మృదుల్ కచ్వా తెలిపారు. కేసు దర్యాప్తు కోసం ఆరు బృందాలను నియమించినట్టు పేర్కొన్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. కైలాశ్ మీనాను ఒక్కడినే అరెస్ట్ చేయడంపై పూజారి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబం మొత్తానికి ఈ ఘటనతో సంబంధం ఉందని ఆరోపించారు. వారందరినీ అరెస్ట్ చేయా లని, ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధిత పూజారికి 5.2 ఎకరాల భూమి ఉంది. ఇది గ్రామంలోని రాధాకృష్ణా ఆలయ ట్రస్ట్‌కు సంబంధి ంచినది. ఆలయ పూజారి బాబులాల్ వైష్ణవ్ తన కోసం ఇల్లు నిర్మించుకునేందుకు భూమిని చదును చేయడంతో వివాదం మొదలైంది. ఆయన ప్రయత్నాన్ని కొందరు అడ్డుకున్నారు. ఆ భూమి తమదేనని ఆరోపించారు. విషయం గ్రామ పెద్దలకు చేరగా, వారు పూజారికి అనుకూలంగా తీర్ప

# అటకెక్కే కేసులతో ఎవరికి లాభం ?

నేటినిజం
శనివారం 10-10-2020

రాజకీయ నాయకులు అవినీతి అక్రమాల కేసులను తమకు అనుకూలంగా మలుచుకుంటారే తప్ప నీతి, నిజాయితీతో వాటి నిగ్గు తేలుస్తారన్న నమ్మకం లేదు. గతంలో అనేక కేసులను పరిశీలిస్తే ఇలాంటి సమాధానమే వస్తుంది. తెలంగాణలో డ్రగ్స్ కేసు ఊసే లేకుండా పోయింది. ఎందరో తారలను, దిగ్గజాలను గడగడలాడించారు. వారికి డ్రగ్స్‌తో గల సంబంధాలను ఆరా తీసారు. అంతా వలకు చిక్కారని సామాన్యులు సంబరపడ్డారు.ఇక తప్పించుకోలేరని అనుకున్నారు. కానీ జరిగింది మాత్రం శూన్యం. దర్యాప్తు చేసిన అధికారి అకున్ సబర్వాల్ బదిలీపై కేంద్ర సర్వీసులకు వెళ్లారు. తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన పలువురు డ్రగ్స్ వాడినట్టుగా ప్రచారం జరగడం, రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు అనుమానితుల జాబితాలో ఉన్న నటీనటులను రోజుల తరబడి విచారించడాన్ని చూశాం. చివరకు ఏం తేల్చారంటే, అధికారుల నుంచి సమాధానం లేదు. పరువు కోసం తెలుగు చలనచిత్ర పరిశ్రమ ప్రభుత్వం ముందు మోకరిల్లింది. అంతే అప్పటినుంచి చిత్రపరిశ్రమ పెద్దలు అవకాశం దొరికినప్పుడల్లా అధికార నేతలను పొగడ్తలతో ముంచెత్తు తున్నారు. ఆ తరవాత నయీమ్ కేసు అలాగే అటకెక్కింది. పోలీస్ అధికారులకు సంబంధాలు లేవని క్లిన్ చిట్ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లలో పూర్తి అవకతవకలు జరిగాయని తొలినాళ్లలో సిఎం కెసిఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు బినామీ పేర్లతో ప్రభుత్వ ఖజానాను బొక్కేశారని అన్నారు. సిఐడి విచారణ జరిగింది. ఇక అక్రమార్కుల భరతం పట్టడం ఖాయమని అంతా భావించారు. కానీ జరిగిందేమిటో మన కళ్లముందున్నది. ఎపిలో చంద్రబాబు అవినీతిపైనా ఆరోపణలు వచ్చాయి. ఉమ్మడి ఎపితో పాటు, విభజిత ఎపిలో ఆయన అక్రమాలపై పుంఖాను పుంఖానుగా వార్తలు వచ్చాయి. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. అలాగే జగన్ అవినీతి సంపాదనపై సిబిఐ విచారణ సాగింది. ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. చివరకు సిఎం అయ్యాక కేసులు అటకెక్కాయి. రాజకీయ నాయకుల అవినీతిపై ఎన్ని కేసులు వచ్చినా అటకెక్కడం ఖాయం అని కాలం చెబుతోంది. ఇటీవల సుప్రీం తీర్పుతో ఏమైనా కదలిక వస్తుందా అన్నది చూడాలి. ఇక తాజాగా మహారాష్ట్రలో కూడా ఇలాంటి రాజకీయాలే నడుస్తున్నాయి. నటుడు సుశాంత్ సింగ్ ఆత్మహత్య తో డ్రగ్స్ కేసులు తెరపైకి వచ్చాయి. రియా చక్రవర్తి సహా అనేకులను విచారించారు. ఆమెను జైల్లో పెట్టారు. మొన్నీ మధ్యనే బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే సమయంలో ఇప్పుడు టెలివిజన్ రేటింగ్స్ పాయింట్స్ (టీఆర్‌పీ) స్కామ్ వెలుగు చూసింది. ముంబైలో టీవీ కార్యక్రమాల ప్రజాదరణను గణాంకాలతో వివరించే టీఆర్‌పీ ఆధారంగా ఆయా కార్యక్రమాలకు ప్రకటనలు వస్తాయి. ముంబైలో కొన్ని టీవీ చానళ్లు అక్రమ మార్గాల ద్వారా టీఆర్‌పీలను పెంచుకుంటున్న విషయాన్ని పోలీసులు బయటపెట్టారు. ఇందుకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు. రిపబ్లిక్ టీవీకి కూడా ఈ కుంభకోణంలో భాగం ఉందని ముంబై పోలీస్ కమిషనర్ పరమ్‌వీర్ సింగ్ వెల్లడించారు. బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అనుమానాస్పద మృతి కేసులో మహారాష్ట్ర ప్రభుత్వంపై, ముంబై పోలీసులపై ఆ న్యూస్ చానల్ తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన దరిమిలా ఇలా కేసు రావడం అనుమానాలకు తావిస్తోంది. సుశాంత్ మృతి కేసులో ప్రశ్నించినందువల్ల ముంబై పోలీస్ కమిషనర్ తమపై తప్పుడు అభియోగాలు మోపారని ఆ చానల్ ఎడిటర్ ఇన్ చీఫ్ అర్నాబ్ గోస్వామి ఆరోపించారు. మొత్తంగా డ్రగ్స్ కేసు ఇంకా కొలిక్కి రాలేదు. విచారణలు సాగుతున్నాయి. బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ హీరోలు, హీరోయిన్లకు డ్రగ్స్ వాడకంతో సంబంధం ఉన్నట్టు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో లీకులు ఇవ్వడంతో పాటు.. కొంతమందికి నోటీసులు కూడా జారీ చేసింది. ఇందులో భాగంగానే రియా చక్రవర్తిని, ఆమె సోదరుడిని అరెస్ట్ చేశారు.

దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలన్నీ గాలికి పోయి... సుశాంత్ ఆత్మహత్య కేసు ఇప్పుడు దేశవ్యాప్త సమస్యగా మారింది. కరోనా కారణంగా దేశంలో సగటున రోజుకు వెయ్యి మంది మరణిస్తున్నా, రోజూ కొత్తగా దాదాపు లక్ష మందికి వైరస్ సోకుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. సినీ తారల వ్యక్తిగత జీవితాల పట్ల జనానికి కూడా ఆసక్తి ఉంటుంది కనుక అధికారులకు, మీడియాకు కూడా ఇదే ప్రధాన ప్రసార వస్తువు అయ్యింది.. ఇంతకీ ఎన్సీబీ చేస్తున్న హడావిడి వల్ల ఏం జరుగుతుందన్న ప్రశ్నకు మాత్రం ఎవరి వద్దా సమాధానం లేదు. ముంబయిలో కొలువుదీరిన నార్కోటిక్స్ అధికారులు విచారణ పేరిట ప్రముఖ తారలను పిలిపించుకుంటూ వినోదాన్ని పంచుతున్నారు. ఈ వ్యవహారంలో కేంద్రబిందువైన హీరో సుశాంత్ సింగ్ ఆత్మహత్య చేసుకున్నాక.. మధ్యలో తలదూర్చిన కంగనా రనౌత్‌కు కేంద్రప్రభుత్వం సీఆర్పీఎఫ్ సిబ్బందితో రక్షణ కల్పించింది. ఆమె ఎవరి పేరు పలికితే వారికి నోటీసులు పంపుతున్నారు. ఎప్పుడో రెండేళ్ల క్రితం జరిగాయని చెబుతున్న చాటింగ్‌ల ఆధారంగా ఎన్సీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం ప్రకారం మత్తుమందులు వినియోగించినవారు అధికారులకు దొరికితే ఆరు నెలల శిక్ష పడుతుంది. ఈ శిక్ష పడాలంటే ఎవరైనా మత్తుమందు వాడుతున్నప్పుడు అధికారులకు పట్టుబడాలి. లేనిపక్షంలో మత్తు పదార్థాలు వాడిన రెండురోజుల లోపు వారు వాటిని వాడినట్లు అధికారులు ఆధారాలతో రుజువు చేయాలి. ఇప్పుడు ఎన్సీబీ చేస్తున్న విచారణ అంతా ఎప్పుడో జరిగిన చాటింగ్ ఆధారంగా మాత్రమే కావడం గమనార్హం. అలాంటప్పుడు ఈ హడావిడి అంతా ఎందుకు అంటే రాజకీయం కోసం అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. కేంద్రప్రభుత్వ నిర్ణయాలు, విధానాలకు వ్యతిరేకంగా బాలీవుడ్‌లో నిరసన స్వరాలు వినిపిస్తుంటాయి. ఈ స్వరాలను అదుపు చేయడానికి ప్రస్తుత విచారణ ఉపయోగపడుతుందన్న విమర్శలు వస్తున్నాయి. కేసులను అటక్కించడానికి విచారణలు అవసరమా అన్నది లోచన చేయాలి.

## జిల్లాలో 343 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**-4లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం**

ఖమ్మం,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఖరీఫ్ వానకాలం ధాన్యం సేకరణకు ఖమ్మం జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ , వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మొత్తం 343 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, మార్కెట్, పౌరసరఫరాలు, సివిల్ సప్లయిస్, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో ధాన్య సేకరణ జరగాలని సూచించారు. వానాకాలం సీజన్‌లో సుమారు 4 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనాలో భాగంగా ఈ సారి మార్కెటింగ్ శాఖ ద్వారా కూడా 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముందుగానే ప్రణాళికా బద్ధంగా అవసరమైన గన్నీబ్యాగులను సిద్ధంగా ఉంచాలని, అవి కేవలం రైతులకే అందించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీల్లో ప్రతిరోజు డేటా ఎంట్రీ జరగాలని కలెక్టర్ సూచించారు. జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డుల్లో కొవిడ్-19 నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, శానిటైజర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు కూడా మాస్క్‌లు ధరించేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్తి కొనుగోలుకు సీసీఐ ద్వారా ఏర్పాటు చేస్తున్న 11 కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం నిర్ధారణ పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు.

రైతుకు కనీస మద్దతు ధర లభించే విధంగా సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరగాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌తో పాటు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌లలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ విస్తరణాధికారులు, ఐకేపీ, రెవెన్యూ సిబ్బంది కౌలు రైతులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. జిన్నింగ్ మిల్లులకు వచ్చే రైతులు రోజుల తరబడి వేచి ఉండకుండా, త్వరగా వారి ఉత్పత్తులను కొనుగోలు చేసి పంపే విధంగా అవసరమైన కంప్యూటర్లు, సిబ్బంది అదనంగా సమకూర్చుకోవాలని మార్కెటింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## ఉమ్మడి జిల్లాలో పెరగనున్న పత్తి దిగుబడులు

**-సిసిఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లకు ఏర్పాట్లు**

ఆదిలాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా వరి, పత్తి, కంది, సోయా వేశారు. ఈసారి మక్క తక్కువగా సాగైంది. పత్తి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా.. మంచిర్యాల జిల్లాలో అత్యల్పంగా సాగైంది. నాలుగు జిల్లాల్లో కలిపి 11 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. మొత్తం 85 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరి పంట మంచిర్యాల జిల్లాలో అత్యధికంగా సాగు కాగా.. ఆదిలాబాద్‌లో అత్యల్పంగా సాగైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.30 లక్షల ఎకరాల్లో పంట వేయగా.. 75.99 లక్షల క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. కంది పంట అత్యధికంగా ఆదిలాబాద్, అత్యల్పంగా మంచిర్యాల జిల్లాలో సాగవుతున్నది. మొత్తం 1,25,163 ఎకరాల్లో సాగవుతుండగా.. 3.77 లక్షల క్వింటాళ్ల దిగుబడి రానుంది. ఈ యేడాది పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.5,825లుగా సీసీఐ ప్రకటించింది. వడ్లను సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు చేయనున్నారు. గ్రేడ్- ఏ రకానికి క్వింటాల్‌కు రూ.1,888, గ్రేడ్-బీ రకానికి రూ.1,868గా సర్కారు ప్రకటించింది. కందిని ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేయనుంది. మద్దతు ధరగా రూ.6వేలు ప్రకటించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన పంటల సాగు సర్వేలో గ్రామాల్లో రైతులు ఎన్ని ఎకరాల్లో పత్తి వేశారనే వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వివరాలను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పంపిస్తారు. వీటి ఆధారంగా పంట కొనుగోళ్లు జరుగుతాయి. పండించిన మొత్తం కంటే ఎక్కువ తీసుకొచ్చినా, సాగు చేయని రైతులు విక్రయ కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చినా సిస్టం అనుమతించదు. దీంతో దళారులు పంటను ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకునే అవకాశం ఉండదు. కేవలం సాగు చేసిన రైతులు మాత్రమే మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉంది. సీసీఏ కొనుగోలు చేసిన పత్తిని నిల్వ చేసుకొనేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జిన్నింగ్ ఫ్యాక్టరీలను అ÷-దదెకు తీసుకుంది. కాగా.. వడ్లను కూడా గ్రామాలవారీగా కాంటాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయడానికి సర్కారు చర్యలు తీసుకుంటున్నది.

## వ్యవసాయ మార్కెట్లో దోపిడీకి చెక్ పడేనా ?

**-కొత్త వ్యవసాయ చట్టంతో మేలంటున్న బిజెపి నేతలు**

హైదరాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): వ్యవసాయ మార్కెట్లలో రైతులకు ఏమాత్రం రక్షణ లేదు. ఏ ధాన్యాన్ని అయినా, మార్కెట్టులోని వ్యాపారస్థులు సంఘటితమై వారే కనిష్ఠ, గరిష్ఠ ధరలను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్టులో ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు ఉన్నా వాటి కొలతల్లో మార్పు చేసుకుంటూ తూకంలో మోసం చేస్తున్నారు. నమూనాల పేరుతో కిలోలకు కిలోలు తీసి రైతులకు నష్టం కలిగిస్తున్నారు. కమిషన్ ఏజెంట్లు చట్టం నిర్దారించిన రేటు గాక ఇష్టానుసారం అదనపు కమిషన్ తీసుకుంటున్నారు. తేమ పేరుతో రేటు తగ్గించడం మరో దోపిడీ ఏటా చూస్తూనే ఉన్నాం. రైతుల వద్ద మార్కెట్ ఫీజు వసూలు చేసి ప్రభుత్వానికి కట్టకుండా ఎగవేస్తున్నారు. ప్రభుత్వం, పాలకవర్గాలు ఈ దోపిడీవర్గాలకు కొమ్ము కాస్తున్నాయి. ఇవే కాకుండా ఇంకా చిన్నచిన్న మోసాలు అనేకం ఉన్నాయి. రైతు మార్కెట్లో తప్పనిసరై అమ్ముకుని రావలసి వస్తున్నది. వరంగల్, ఆదిలాబాద్, నిజమాబాద్ మార్కెట్లలో పత్తి తదితర పంటల ధరల విషయంలో గొడవలు ఈ కోవకు చెందినవే. మార్కెట్టులో సరైన ధర లభించకపోతే రైతులు తమ ఉత్పత్తుల్ని గోడౌన్లో నిల్వ చేసుకుని, రేటు వచ్చినప్పుడు అమ్ముకునే వెసులుబాటును తెలంగాణ ప్రభుత్వం కల్పించినా, రైతులకు మేలు జరిగిన దాఖలాలు లేవు. మార్కెట్ బయట అమ్ముకుందామంటే రేటు రాని పరిస్థితి. నిజానికి ఈ పరిస్థితులను నిశితంగా గమనించిన మీదటే, రైతులకు స్వేచ్ఛా మార్కెట్ పద్ధతి లాభదాయకమని గ్రహించి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చరిత్రాత్మక చట్టాన్ని తెచ్చింది. వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వలన రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పడుతున్నట్టు నేషనల్ రిజిస్టర్ క్రైమ్ బ్యూరో రికార్డు తెలియపరుస్తోంది. ఇటీవల కేందప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నూతన బిల్లులు రైతుల సంక్షేమానికి రక్షణ కవచంలా పని చేస్తాయని బిజెపి నేతలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలు ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో మార్కెట్ కమిటీల పాలకమండళు ్ల అవినీతిని, వ్యాపారస్థుల దోపిడీని నియంత్రించడలో విఫలమవుతున్నాయని ఆరోపించారు.తాజాగా తీసుకుని వచ్చిన చట్టం ప్రకారం రైతు పండించిన పంట వ్యవసాయ మార్కెట్లలో అమ్ముకోవచ్చు లేదా మార్కెట్ బయట దేశంలో ఎక్కడైనా ఎవరికైనా అమ్ముకోవచ్చు. రైతులు మార్కెట్ బయట అమ్ము కోవటానికే ఈ చట్టం వర్తిస్తుంది. రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లపై ఏ ఆంక్షలూ లేవని అన్నారు.

# ఎన్నికల ప్రచారంలో కానరాని కరోనా నిబంధనలు

**విచ్చలవిడిగా మందీమార్బలంతో ప్రచారాలు పట్టించుకోని ఎన్నికల అధికారులు**

న్యూఢిల్లీ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): కరోనా సమయంలో ఎన్నికల సంఘం కఠినంగా ఉండాల్సి ఉండగా ప్రచారంలో ఎక్కడా కరోనా నిబంధనలు కానరావడం లేదు. బీహార్‌తో పాటు దేశంలో అనేక చోట్ల ఎన్నికలు జరుగుతున్నాయి. గతంలో ఎన్నికల సంఘం అంటే ఉన్న భయాలు శేషన్‌తోనే పోయాయి. ఆయన ఉన్నంత కాలం ఎన్నికల నిర్వహణ అన్నది రాజకీయ పార్టీలకు వణుకు పుట్టించింది. కానీ ఇప్పుడు అలాంటి స్థితి లేదు. దేశంలో మొక్కుబడిగా సాగుతున్న ఎన్నికల క్రతువు రూపురేఖలను మార్చిన ఘనత టీఎన్ శేషన్‌ది. నాటికీ నేటికీ ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచుతున్నారు. కరోనా ఉన్నా సామాజిక దూరం, మాస్కులు కట్టుకోవడం అన్నది మరచి ప్రచారంలో పాల్గొంటున్నారు. 1990లో ఆయన ఎన్నికల సంఘం చీఫ్‌గా శేషన్ పదవీబాధ్యతలు చేపట్టిననాటికి దానికి గుర్తింపు, గౌరవం అనేవి పెద్దగా లేవు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం, ఆ తర్వాత జరిగేవాటన్నిటికీ మౌన ప్రేక్షక పాత్ర వహించడం ఎన్నికల సంఘానికి రివాజుగా మారిన తరుణంలో ఆయనొచ్చి ఆ సంప్రదాయాన్ని బద్దలు కొట్టారు. సమర్థవంతంగా వ్యవహరించగలిగే చేవ ఉంటే...ఎలాంటి తీవ్ర నిర్ణయం తీసుకోవడానికైనా వెనకాడ లేదు. ఉంటే కొమ్ములు తిరిగిన నాయకగణం దారికి రావడం ఖాయమని శేషన్ నిరూపించారు.

ఫిర్యాదులు రావడం, వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడం మాత్రమే తన బాధ్యతగా మారిందే తప్ప కఠిన చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఇసిపై లేకుండా పోయింది. మీడియా సైతం ఏ నియోజకవర్గంలో ఏం జరిగిందో...పోలింగ్ కేంద్రాల్లో అసాంఘిక శక్తులు ఎలా స్వైరవిహారం చేశాయో...ఎక్కడెక్కడ దళితులు, ఇతర అణగారిన వర్గాలకు చెందినవారూ ఓటేయకుండా పెత్తందార్లు నిలువరించారో వెల్లడించేది. కత్తులతో, బాంబులతో పరస్పరం చంపుకుంటున్న ముఠాలను చూసి ఓటేయడానికి వచ్చినవారు సైతం పారిపోతున్నా పట్టించుకునే ధర్మం చేయడం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు కమిషనర్‌లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి హోదా, అధికారాలు ఉన్నాయి. అయినా ఎన్నికల సందర్భంగా నిష్పక్షపాతంగా జరిగాయనడానికి దాఖలాలు కానరావడం లేదు. మొండిగా, ముక్కుసూటిగా, నిర్దాక్షిణ్యంగా, నిక్కచ్చిగా ఉండేవారిని శేషన్‌తో పోల్చేవారు. పోటర్లకు గుర్తింపు కార్డులు జారీచేయాలని 1994 చివరిలో శేషన్ నిర్ణయించినప్పుడు పార్టీలన్నీ అది వృధా ఖర్చని కొట్టిపారేశాయి. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉండి పోయింది.చివరకు సుప్రీంకోర్టు జోక్యం తప్పనిసరైంది. ఆ తర్వాత సైతం శేషన్ పట్టువీడక పోవడంతో గుర్తింపు కార్డుల జారీ పక్రియ అమలైంది. ఎన్నికల వ్యయంపై జమాఖర్చులు సమర్పించాలని అభ్యర్థుల్ని ఆదేశించి, దాన్ని అందరిచేతా పాటింప జేయడంలో శేషన్ విజయం సాధించారు. ఉన్న చట్టం దుమ్ము దులిపి, అందులోని అధికారాలను ఆయన సంపూర్ణంగా వినియోగించుకున్నారు. కానీ ఆ తరవాత ఇసి కమిషనర్లు వాటి జోలికి పోవడంలేదు. ఎన్నికల్లో విచ్చలవిడితనం షరా మామూలు అయ్యింది. తాజా ఎన్నికల సందర్భంగా దేశంలో ఓ విచిత్ర పరిస్థితి ఉంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన సమయంలో వారిని రోడ్డెక్కేలా చేస్తున్నారు. కరోనా నిబంధనలు పాటించడం లేదు. ఇసి కఠినంగా ఉంటే తప్ప ఎన్నికలు సక్రమంగా నిర్వహించలేమని అధికారులు గుర్తిస్తే మంచిది.

# నిబద్ధ రాజకీయాలకు నిలువుటద్దం పాశ్వాన్

**సొంత ఇమేజ్‌తో దళిత నేతగా ఎదిగిన అరుదైన నాయకుడు**
**అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతర కృషి**

న్యూఢిల్లీ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): బీహార్‌లో ఎన్నికలు జరుగుతున్న వేళ దళిత నేత రాంవిలాస్ పాశ్వాన్ కన్నుమూయడం ఓ విషాదంగానే పరిగణించాలి. ఎంతోకొంత ప్రభావితం చేసే నేతల్లో ఆయన కూడా ఒకరు. బీహార్‌లో బాబూ జగ్జీవన్ రామ్ తరవాత అంతగా ఎదగిన నేత రాంవిలాస్ పాశ్వాన్. ఆయన ఎవరు ప్రధానిగా ఉన్నా వారి క్యాబినేట్‌లో చేరి ఉన్నతస్థానానికి ఎదిగారు. దళితులను అణచివేసి, దొరహంకారం ప్రదర్శించే బీహార్ లాంటి ఆటవికా రాజ్యంలో పాశ్వాన్ జాతీయస్థాయి నేతగా ఎదగడం అన్నది ..ఆయన నిజాయితీ రాజకీయాలకు నిదర్శనం. తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన కేంద్రమంత్రి, లోక్‌జన శక్తి పార్టీ నేత రాంవిలాస్ పాశ్వాన్ భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారనే చెప్పాలి. ఓ దళిత నేత ఇంతగా ఎదగడానికి అవకాశాలు రాని ప్రాంతంలో ఆయన ఎదగడంఅన్నది స్వశక్తి తప్ప మరోటి కాదు.

అలా రాంవిలాస్ పాశ్వాన్ దేశంలోని ప్రముఖ దళిత నాయకుల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా క్రియాశీల రాజకీయాల్లో ఉండడం అన్నది మామూలు విషయం కాదు. గతేడాదే రాంవిలాస్ పాశ్వాన్ రాజకీయాల్లో 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. 1969లో తొలిసారి ఆయన బీహార్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఐదుగురు ప్రధానుల కేబినెట్‌లో ఆయన కేంద్రమంత్రిగా సేవలందించారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లి వచ్చిన రాంవిలాస్ పాశ్వాన్ 1977లో తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ తరువాత కూడా వరుసగా విజయాలు సాధించారు. 1989లో నాటి ప్రధాని వీపీ సింగ్ కేబినెట్‌లో కార్మిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత ప్రధాని వాజ్‌పేయి మంత్రివర్గంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రిగా విధులు నిర్వహించారు. 2000 సంవత్సరంలో జనతాదళ్ నుంచి బయటకు వచ్చిన రాంవిలాస్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీని ఏర్పాటు చేశారు. 2004 ఎన్నికల అనంతరం నాటి యూపీఏ ప్రభుత్వంలో చేరారు. అందులో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిగా విధులు నిర్వహించారు. ఇక 2009 ఎన్నికల్లో పరాజయం పాలైన పాశ్వాన్ 2014 ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ప్రధాని మోడీ కేబినెట్‌లో మంత్రి అయ్యారు. 2019 తరువాత కూడా ఎన్డీయేలోనే కొనసాగుతూ... మరోసారి మోడీ కేబినెట్‌లో మంత్రిగా చేరారు. యవ్వనంలో పాశ్వాన్ ఒక ఫైర్‌బ్రారడ్ సోషలిస్ట్. ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో జయప్రకాశ్ నారాయణ్ వంటి నేతల సాంగత్యంలో నాయకుడిగా ఎదిగారు. కృషి, పట్టుదలతో పాశ్వాన్ రాజకీయాల్లో ఎదిగారు. యువకుడిగా ఎమర్జెన్సీ దురాగతాలను ఎదుర్కొన్నారు. ఆయన అద్భుతమైన మంత్రి, పార్లమెంటేరియన్. చాలా విధాన విషయాల్లో తనదైన ముద్ర వేశారు. రాజకీయ జ్ఞానం, దార్శనికత, పాలనాదక్షతల్లో ఆయనకు సాటిలేరు. పాశ్వాన్ తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో అణగారిన వర్గాల వాణిని ఎలుగెత్తి చాటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రామ్ విలాస్ పాశ్వాన్ అండగా నిలిచారు. 946 జులై 5న బిహార్‌లోని ఖగారియాలో పాశ్వాన్ జన్మించారు. పీజీ, న్యాయవిద్య అభ్యసించారు. విద్యాభ్యాసం అనంతరం డీఎస్పీగా పోలీసు ఉద్యోగం వచ్చినా రాజకీయాలపై ఆసక్తితో ఆ ఉద్యోగంలో చేరలేదు. 1969లో సంయుక్త సోషలిస్ట్ పార్టీ టికెట్‌పై తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. బిహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానం నుంచి రికార్డు స్థాయిలో 8 సార్లు గెల్చారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ రికార్డు చాలా రోజుల పాటు ఆయన పేరు పైనే ఉన్నది. పేదలు, అణగారిన వర్గాల సమస్యలపై అవకాశం లభించిన ప్రతీసారి గళమెత్తే నేతగా పాశ్వాన్ పేరు గాంచారు. మండల్ కమిషన్ నివేదిక అమలుకు ఆయన గట్టిగా ప్రయత్నించారు. పార్టీలకు అతీతంగా అందరు నాయకులతో ఆయన సత్సంబంధాలు కలిగి ఉండేవారు. సైద్ధాంతిక వైరుధ్యాలున్న పార్టీల నేతృత్వంలో సాగిన కేంద్ర ప్రభుత్వాల్లో ఆయన భాగస్వామిగా, మంత్రిగా విజయవంతంగా కొనసాగడం విశేషం. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వంలోనూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారులోనూ కీలకంగా వ్యవహరించడం ఆయనకే చెల్లింది. దాదాపు ఐదు దశాబ్దాలకు పైబడిన రాజకీయ జీవితంలో దళితులు, అణగారిన వర్గాల కోసం పోరాడే నేతగా ఆయన దేశవ్యాప్తంగా పేరుగాంచారు. ఉత్తర భారత దేశంలో దళితులను ఏకం చేయడంలో పాశ్వాన్ కీలక పాత్ర పోషించారు. బీజేపీతో విబేధాల కారణంగా వాజ్‌పేయి ప్రభుత్వం నుంచి బయటకు వచ్చిన సమయంలో నాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీని తీవ్రంగా విమర్శించిన పాశ్వాన్.. అదే మోదీ నాయకత్వంలోని ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగారు. సిద్ధాంతాలకు అతీతంగా అధికారంలో ఉన్న పార్టీలకు దగ్గరయ్యే ఆయన తీరును ప్రత్యర్థులు 'వాతావరణ నిపుణుడు' అంటూ విమర్శించేవారు. రాంవిలాస్ పాశ్వాన్ మృతి పట్ల రాష్ట్రపతి, ప్రధాని నరేంద్రమోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు కీలక నేతలు సంతాపం తెలిపారు. ఇది తనకు మాటలకు అందని విషాదమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆయన లేని లోటును ఎవరూ పూడ్చలేరని తెలిపారు. ఆయన మరణం తనకు వ్యక్తిగతంగానూ లోటు అని మోడీ వ్యాఖ్యానించారు. ఓ మంచి స్నేహితుడిని, సహచరుడిని పేదల కోసం ఆలోచించే వ్యక్తిని కోల్పోయానని అన్నారు.

# ఉత్తరానికో దండం పెట్టేశారు !

**ఏటా అక్టోబర్ 9 ప్రపంచ పోస్టల్ డే**

హైదరాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఉత్తరం అందుకోవడం, రహస్యంగా విప్పి చదువుకోవడం, ఎవరైనా వస్తుంటే దిండికింద దాచుకోవడం ప్రేమికులకు ఖర్చులేని ఓ మధురానుభూతి. దూరంగా సైన్యంలోనో, మరో ఉద్యోగంలోనో ఉన్న భర్తో, కోడుకో ఉత్తరం రాస్తాడనీ, క్షేమ సమాచారం చెబుతాడనీ వీధి వంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది. పోస్ట్ అన్న మాట వినబడగానే గుమ్మంలోకి పరుగెత్తి ఉత్తరం లాక్కోవడం ఓ మధురానుభూతి. పోస్ట్‌మెన్ వచ్చి సైకిల్ గంట కొట్టడం నేటి తరానికి తెలియక పోవచ్చు. పాతతరంలోని ఎన్నో సినిమా

## 27మంది మందుబాబుల లైసెన్సులు రద్దు

కరీంనగర్, అక్టోబర్ 9 (నేటినిజం ప్రతినిధి): మద్యంసేవించి వాహనాలు నడిపిన కేసుల్లో ఈమధ్యకాలంలో పట్టుబడిన 27మందికి సంబంధించిన వారి లైసెన్సులను రద్దుచేస్తూ శుక్రవారంనాడు రవాణాశాఖ అధికారులు ఉత్తర్వులను జారీచేశారు. ఈమేరకు లైసెన్సులు రద్దుకాబడిన వారికి సమాచారం అందించడంతోపాటు వారి ఒరిజనల్ డ్రైవింగ్ లైసెన్సులను స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు జి తిరుమల్, ఇ నాగార్జునరావులు తెలిపారు.వివరాలు ఇలాఉన్నాయి.

ఈమధ్యకాలంలో మద్యంసేవించి పట్టుబడిన వారిలైసెన్సులను రద్దుచేయాలని కోరుతూ కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాలమేరకు రవాణాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపామని ఇందులో 27మంది లైసెన్సులను 06నెలల నుండి ఒకసంవత్సరంపాటు రద్దుచేస్తున్నట్లుగా రవాణాశాఖ అధికారులు ఆదేశాలను జారీచేశారని తెలిపారు. శుక్రవారం నాడు లైసెన్సులు రద్దుఅయిన వారిలో చామన్‌పల్లికి చెందిన బూసారపు సాయిబాబా, కిసాన్‌నగర్‌కు చెందిన బుచ్చాల దేవరాజ్, ధూళికట్టకు చెందిన ఎర్ర రాజశేఖర్, రెడ్డిరాంపల్లికి చెందిన అనసూరి మనోజ్‌కుమార్, భగత్‌నగర్‌కు చెందిన దేవసాని తిరుపతి, గోదావరిఖని రాజీవ్‌నగర్‌కు చెందిన భూక్యా విజయ్‌కుమార్, నాగారంకు చెందిన లక్కాకుల రమేష్, గాంధీరోడ్‌కు చెందిన కిన్నెర నాగరాజు, భగత్‌నగర్‌కు చెందిన దుర్కెట్టి రాజేంద్రప్రసాద్, చిగురుమామిడికి చెందిన పన్యాల్ నాగిరెడ్డి, రంగంపల్లికి చెందిన కుర్ర తిరుపతి, శనిగరంకు చెందిన చక్రం విజయ, కాచిరెడ్డిపల్లికి చెందిన తక్కిడి నరేష్, రామడుగుకు చెందిన ఊకంటి విజయభాస్కరరెడ్డి, మంకమ్మతోటకు చెందిన జంపుల వెంకటేష్, బొమ్మకల్‌కు చెందిన బొడిగె రాజు, కట్టరాంపూర్‌కు చెందిన కొట్టె లక్ష్మన్, కిసాన్‌నగర్‌కు చెందిన బి సుమన్, వావిలాలపల్లికి చెందిన గొట్టం మల్లారెడ్డి, హుజురాబాద్ పాతవాడకు చెందిన శ్రీపతి సునీల్, కట్టరాంపూర్‌కు చెందిన బబ్బూరి కుమర్, గన్నేరువరంకు చెందిన ర్యాకం తిరుపతి, పోరండ్లకు చెందిన తోడెంగ నాగరాజు, వెలిచాలకు చెందిన కల్లెపల్లి ప్రవీణ్‌కుమార్, లక్ష్మిపూర్‌కు చెందిన శివరాత్రి సంపత్, భాగ్యనగర్‌కు చెందిన వరుమణి రాకేష్, కట్టరాంపూర్‌కు చెందిన మండ సాయిచరణ్ లకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సులను 06నెలల నుండి ఒకసంవత్సరంపాటు రద్దుచేశారు. రవాణాశాఖకు పంపిన మరికొన్ని ప్రతిపాదనలు లైసెన్సుల రద్దుకోసం పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు కమిషనరేట్ వ్యాప్తంగా మద్యంసేవించి పట్టుబడిన కేసుల్లో డ్రైవింగ్‌లైసెన్సులు రద్దయిన వారిసంఖ్య 167కు చేరుకుంది.

మద్యం సేవించి పట్టుబడితే లైసెన్సుల రద్దుకు సిఫారసు

మద్యంసేవించి పట్టుబడే వాహనదారులకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకోసం ప్రతిపాదనలు పంపించే పక్రియ నిరంతరం కొనసాగుతుందని ట్రాఫిక్ ఏసిపి యం సోమనాథం తెలిపారు. రోడ్డుప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంక్‌అండ్ డ్రైవ్‌లను నిర్వహించడం జరుగుతున్నదని చెప్పారు. ఈ డ్రంక్‌అండ్‌డ్రైవ్‌ల నిర్వాహణ ద్వారా రోడ్డుప్రమాదాల సంఖ్య తగ్గుతూవస్తోందని పేర్కొన్నారు. పోలీసులకు తమవంతు సహకారం అందిస్తున్న అన్నివర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య మిత్రలను తక్షణమే నియమించాలి

### ఆస్పత్రుల్లో వైద్య సేవలకు ఇక గ్రేడింగ్ విధానం

### కరోనా సమీక్షలో సిఎం జగన్

అమరావతి,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఆరోగ్యశ్రీ ఆస్పత్రులన్నింటిలో ఆరోగ్యమిత్రలను తప్పనిసరిగా నియమించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలు, సదుపాయాలకు ఇక నుంచి గ్రేడింగ్ విధానం అమలు చేయాలని.. 15 రోజుల్లోగా ఈ పక్రియ అంతా పూర్తి కావాలని తెలిపారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కోవిడ్-19 నివారణ చర్యలపై సమీక్ష జరిపారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, వైద్యుల అందుబాటు, ప్రమాణాలతో కూడిన ఔషధాలు, శానిటేషన్, నాణ్యతతో కూడిన ఆహారం, ఆరోగ్యమిత్రలు ఈ ఆరు ప్రమాణాలు ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో కచ్చితంగా అమలవ్వాలని అన్నారు. అన్ని కోవిడ్ ఆస్పత్రుల్లోనూ ఇవే ప్రమాణాలు పాటించాలి. రోగులకు ఆరోగ్య మిత్రలు పూర్తి స్థాయిలో సేవలందించాలి. 104 కాల్ సెంటర్ మరింత సమర్థంగా పని చేయాలి. అధికారులు ఈ కాల్ సెంటర్ పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలి. ప్రతి రోజూ తప్పనిసరిగా మాక్ కాల్స్ చేయాలి. ఫోన్ చేసిన అర గంటలో బెడ్ల కేటాయింపు జరగాలి. హోం ఐసొలేషన్‌లో ఉన్న వారికి మెడికల్ కిట్లు అందాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు.డిప్యూటీ సీఎం ఆళ్లనాని, సీఎస్ నీలంసాహ్ని, డీజీపీ సవాంగ్ హాజరయ్యారు.

## ఎపి పాలిసెట్ ఫలితాలు విడుదల

### -84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత

విజయవాడ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ పాలిసెట్-2020 ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం విడుదలయ్యాయి. ప్రసాదంపాడులోని సాంకేతిక విద్య కమిషనర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎంఎం నాయక్ పాలిసెట్ ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీ పాలిసెట్ 2020లో 84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సీఎస్ అనంతరాము తెలిపారు. పాలిసెట్ 2020 పరీక్షకు 88,372 మంది అభ్యర్థులు నమోదు చేసుకొన్నారు. అందులో 71,631 మంది పరీక్ష రాయగా 84 శాతంతో 60,780 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 50,706 మంది పరీక్షలు రాయగా 42,313 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 20,925 మంది పరీక్షలు రాయగా 18,467 మంది ఉత్తీర్ణత సాధించారు. పశ్చిమ గోదావరికి చెందిన మట్టా దుర్గా సాయి కీర్తి తేజ 120 మార్కులతో టాప్ 1 లో నిలిచారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సుంకర అక్షయ ప్రణీత్ 119 మార్కులతో రెండో ర్యాంకు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సవిలత శ్రీదత్త శ్యామ సుందర్ 118 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. 2020-21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటుకు సంబంధించి 271 కళాశాలల్లో 66,742 సీట్లు అందుబాటులో ఉన్నాయి'అని అనంతరాము పేర్కొన్నారు.

## 297వ రోజుకు అమరావతి పోరు

### -దుర్గగుడికి వెళ్లకుండా రైతులను అడ్డుకున్నపోలీసులు

అమరావతి,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): కనకదుర్గమ్మ ఆలయానికి పొంగళ్లతో మొక్కు చెల్లించుకునేందుకు బయలుదేరిన లింగాయపాలెం, ఉద్దండరాయనిపాలెం రైతులను ప్రకాశం బ్యారేజ్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మూడు రాజధానులు వద్ద అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ శుక్రవారం ఉదయం లింగాయపాలెం, ఉద్దండరాయని పాలెం నుంచి రైతులు మొక్కులు చెల్లించుకునేందుకు కాలినడకన దుర్గగుడికి బయలుదేరారు. అయితే బ్యారేజ్ వద్ద అడ్డుకున్న పోలీసులు ప్రచారం కోసం అయితే వెళ్లొద్దని స్పష్టం చేశారు. కాగా అమరావతి కోసం మొక్కులు చెల్లిస్తున్నామని తెలిపారు. దీక్షలో ఉన్నవారు మినహా మిగిలిన వారు ఆకుపచ్చ కండువాలు, జెండాలు తీసి వెళ్లాలని పోలీసు అధికారులు సూచించారు. రాజధాని కోసం రైతులు, మహిళలు చేపట్టిన నిరసనలు 297వ రోజుకు చేరుకున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, ఉద్దండరాయుని పాలెం, రాయపూడి, నీరుకొండ, అనంతవరం, పెదపరిమి, ఐనవోలు,నెక్కల్లు తదితర గ్రామాల్లోని శిబిరాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని రాజధాని రైతులు స్పష్టం చేశారు. కరోనా సూచనలు పాటిస్తూ అమరావతి ఉద్యమం సాగుతోంది.

## జగన్ కేసులపై సిబిఐ కోర్టులో విచారణ

### తదుపరి విచారణ 12కు వాయిదా

హైదరాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని సిబిఐ, ఈడీ కోర్టుల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ ఈ నెల 12 కి వాయిదా పడింది. జగన్, విజయసాయిరెడ్డి, ఇతర నిందితులు వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు కోరుతూ పిటిషన్లు దాఖలు చేయగా, వాటిని కోర్టు అంగీకరించింది. ఈ కేసులకు సంబంధించి ప్రతీ శుక్రవారం విచారణ జరిగేది. అయితే ఇటీవల సుప్రీం కోర్టు ప్రజా ప్రతినిధులకు సంబంధించిన కేసులను సత్వర విచారణ చేపట్టాలని సూచించింది. దీనిపై స్పందించిన హైకోర్టు రోజువారీ విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణను సిబిఐ కోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. కరోనా నేపథ్యంలో.. కోర్టు హాలులో ఎక్కువమంది న్యాయవాదులు, నిందితులు ఉండటం ఇబ్బందిగా ఉండటంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టాలని, జగన్ తరపు న్యాయవాదులు కోరారు. తాము కూడా విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, దీనిపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జగన్ కేసులో నాలుగు ఛార్జిషీట్లకు సంబంధించి హైకోర్టులో స్టే ఉంది. స్టే ఉన్న కేసులను నవంబర్ 9 కి వాయిదా వేస్తున్నట్లు సిబిఐ కోర్టు తెలిపింది.

# దుబ్బాకలో సెంటిమెంట్ రాజకీయాలు

### రామలింగారెడ్డి సేవలపై టిఆర్ఎస్ ఫోకస్

### చెరుకు ముత్యం రెడ్డి అభివృద్ధి మోడల్‌పై కాంగ్రెస్ ప్రచారం

సిద్దిపేట,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల ప్రచారంలో ఇప్పుడు రామలింగారెడ్డి సెంటిమెంట్‌ను టిఆర్ఎస్ బాగా ఉపయోగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ చెరుకు ముత్యం రెడ్డి అభివృద్ధి నమూనాను ప్రస్తావిస్తోంది. ఇవేమీ లేకున్నా ప్రచారంలో నేను కూడా ఉన్నానని బిజెపి ప్రచారం చేస్తోంది. కేవలం టిఆర్ఎస్ అవినీతిపైనే వారు ప్రధానంగా ఫోకస్ పెట్టారు. రామలింగారెడ్డి ఎమ్మెల్యేగా ఇంటింటికీ తాగునీరు అందించారని, కాళేశ్వరం జలాల కోసం కష్టపడ్డారని, డబుల్ ఇళ్లు నిర్మించారని నేతల ప్రచారంలో ప్రధానంగా సాగుతోంది. ఆయన ఆశయాలు సాగాలంటే సుజాతను గెలిపించాలని కోరుతున్నారు. ప్రజా ఉద్యమాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సేవలు ఎనలేనివని ప్రచారం చేస్తున్నారు. ఆయన సేవలను టీఆర్ఎస్ మరువదని, దుబ్బాక ఉప ఎన్నికల్లో రామలింగారెడ్డి సతీమణి సుజాతను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి హరీశ్‌రావు ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రచారంలో చెరుకుముత్యం రెడ్డి సేవలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఎక్కడ చూసినా ఈ ఇద్దరి పేర్లు బాగా ప్రచారంలో ముందున్నాయి. ముత్యం రెడ్డి అభివృద్ధి కళ్లకు కనిపిస్తోందని కాంగ్రెస్ ప్రచారంలో చెప్పడమే గాకుండా టిఆర్ఎస్ ఆయనకూ, ఆయన కుటుంబానికి మోసంచేసిందని కూడా ప్రచారం చేస్తున్నారు. ఇకపోతే తెలంగాణ ఉద్యమంలో, టీఆర్ఎస్ పార్టీలో రామలింగారెడ్డి క్రియాశీలకంగా పనిచేశారని గుర్తు చేస్తున్నారు. రామలింగారెడ్డి చేసిన సేవలను గుర్తుంచుకుని దుబ్బాక ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసేందుకు సుజాతకు సీఎం కేసీఆర్ అవకాశం ఇచ్చారని ఆమెను గెలిపించి దుబ్బాక ఆశయాలను సాకారం చేద్దామని టిఆర్ఎస్ నేతలు అంటున్నారు. రామలింగన్న ఆశయ సాధనతో పాటు దుబ్బాక నియోజకవర్గంలో ప్రజా సేవలో ఉండాలన్నారు. తమ కుటుంబానికి అండగా నిలిచినందుకు సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా సోలిపేట సుజాత కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాతను భారీ మెజార్టీతో గెలిపించుకుని రామలింగన్నకు ఘనమైన నివాళు లర్పిద్దామని మంత్రి హరీశ్‌రావు కోరుతున్నారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడిచారన్నారు. జర్నలిస్టుగా, ఉద్యమకారుడిగా, కార్యకర్తగా ఉంటూ...నిరంతరం దుబ్బాక ప్రజల కోసం పరితపించారని గుర్తుచేస్తున్నారు. ప్రజా పక్షాన ఉంటూ రామలింగారెడ్డి ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన రామలింగారెడ్డి..తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడిచి పోరాటాన్ని తీవ్రతరం చేశారంటూ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై శాసనసభలో గొంతెత్తి అప్పటి సమైక్య ప్రభుత్వాలను నిలదీశారన్నారు. సోలిపేట సుజాత అక్కకు రాజకీయాలు కొత్త కావని, ముందు నుంచి ప్రజల మధ్యనే ఉన్నారని, ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారని తెలిపారు. అంతేగాకుండా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కూడా చెబుతున్నారు. ఏ రంగంలో చూసినా నేడు తెలంగాణ అన్ని రాష్ట్రాల్లో కంటే ముందంజలో ఉంది. తెలంగాణ ప్రభుత్వ విధానాలు, పాలసీలు , సంక్షేమ కార్యక్రమాలు దేశానికి రోల్ మోడల్‌గా నిలిచాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలు తెలంగాణ సంక్షేమ పథకాలు, పాలసీలను ప్రశంసిస్తున్నాయన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ఆశీస్సులతో రామలింగారెడ్డి ఇంటింటికీ నల్లా నీరు అందించారని, ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేందుకు కాల్వల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రామలింగారెడ్డి ఆశయాలను సుజాతక్క రూపంలో అతి త్వరలోనే ప్రతి ఎకరానికి సాగు నీరు అందించనున్నామని హరీశ్‌రావు ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. చెరుకు శ్రీనివాసరెడ్డి తరపున కాంగ్రెస్ నేతలు రంగంలోకి దిగారు. దుబ్బాకలో కేవలం చెరుకు ముత్యం రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప మరెప్పుడూ జరగలేదని ప్రచారం చేస్తున్నారు.

# మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముట్టడికి యత్నం

### నగర కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

కరీంనగర్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న నిందితులపట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా కరీంనగర్‌లో కాంగ్రెస్ నేతలు మంత్రి గంగుల కమలాకర్ ఇల్లు ముట్టడికి యత్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర హోమ్ మంత్రి మహమూద్ అలీ ఇంటిని ముట్టడించిన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడికి యత్నించగా పోలీసులు కోర్టు చౌరస్తా వద్ద అడ్డుకుని అరెస్ట్ చేసారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ని పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ వ్యాన్‌లో ఎక్కించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాచార నిందితులను వదిలి, ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం టీఆర్ఎస్ ప్రభుత్వం దమననీతికి నిదర్శనమని అన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, దుబ్బాక ఎన్నికల్లో తెరాస పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై నాయకులను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరీ రవి, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజోద్దిన్, ఎస్సీ సెల్, బీసీ సెల్ నగర అధ్యక్షులు లింగంపల్లి బాబు, బోనాల శ్రీనివాస్ నాయకులు గుండేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, బొబ్బిలి విక్టర్, అబ్దుల్ రెహమాన్, నిహాల్, కొమ్ము సునీల్, పడాల రాహుల్, ఇమ్రాన్, దండి రవీందర్, పులి కృష్ణ, లయీక్, కొలిపాక సందీప్, మేకల నరసయ్య, చాంద్, యనమల మంజుల, రోల్ల సతీష్, షాహీన్ షా, జీ.డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ర్యాలీలకు హోంశాఖ అనుమతి

పాట్నా,అక్టోబర్9 (ఆర్ఎన్ఎ): ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో కేంద్ర హోంశాఖ కోవిడ్ నిబంధనలను భారీ స్థాయిలో సడలించింది. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించుకోవచ్చని ప్రకటించింది. ఈ సడలింపు తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. మాములుగా అయితే పాత సడలింపుల ప్రకారం అక్టోబర్ 15 వరకూ ఈ ర్యాలీలకు అనుమతి లేదు. కానీ హోంశాఖ మాత్రం తక్షణమే అమలులోకి వచ్చేలా నిబంధనలను సడలించింది. కేవలం బిహార్ ప్రాంతంలోనే కాకుండా... ఉప ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, యూపీ, గుజరాత్, కర్నాటక, హర్యానా, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మణిపూర్, నాగాలాండ్, ఒడిశా రాష్ట్రాలకు కూడా ఈ సడలింపు వర్తిస్తుందని కేంద్ర హోంశాఖ పేర్కొంది.

కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

# ఎల్ఆర్ఎస్‌ను ప్రజలు కట్టాల్సిన అవసరం లేదు

### టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు రద్దు చేయాలి

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి డిమాండ్

కరీంనగర్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ సర్వేను వెంటనే ఉపసంహరించు కోవాలని, అక్రమ లే అవుట్లను గుర్తించి క్రమబద్ధీకరణ చేసే పేరుతో, బడా బాబులకు దోచిపెట్టేందుకే ప్రభుత్వం ఈ జీవిఓ తీసుకువచ్చిందని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ., ఆరోపించారు. గతంలో తప్పుడు గణాంకాలతో పదవ తరగతి విద్యార్తుల ఆత్మహత్యలకు కారణమైన గ్లోబరీనా సంస్థ ద్వారా, ఏంతో గోప్యంగా ఉంచవలసిన ప్రజల ఆస్తి వివరాలను సేకరించి, ప్రజల జీవితాలతో ఆడుకోవాలని చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రాబోయేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని, ప్రజలెవరూ ఎల్ఆర్ఎస్ కట్టవద్దని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా ఉచితంగా చేస్తుందని హామీ ఇస్తున్నామన్నారు.

ప్రతి పేదవాడి జీవిత లక్ష్యం సొంత ఇల్లు. అలాంటి ఇల్లు కట్టుకోడానికి కూడా స్థలం కొంటె, కొన్న ధరని మించి ప్రభుత్వంఎల్ఆర్ఎస్ పేరుతో వసూళ్లకు పాల్పడటం దారుణమని మండిపడ్డారు. ముందుగా ప్రభుత్వం వద్ద అనధికార ప్లాట్ల సమాచారం ఎంత వుంది ? అనధికార ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరిగినపుడు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు, అంతా అయిపోయి తెలిసో తెలియకో పేదవాడు ప్లాట్లు కొనుకున్నాక ఎల్ఆర్ఎస్ పేరుతో భారం వేయడం ఎంత వరకు న్యాయమని కవ్వంపల్లి ప్రశ్నించారు. అదే విధంగా గ్రామపంచాయితీల పరిధిలో అనధికార లేఅవుట్ లతో తీవ్రంగా నష్టం వాటిల్లుతే, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పర్మిషన్‌లు ఇచ్చిన తెరాస ప్రజా ప్రతినిధులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందన్నారు. పట్టణ పరిధిలోని స్లమ్ ప్రాంతాల మాదిరిగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ల్యాండ్ రెగ్యూలరైజ్ చేయాలి కాని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, ధరణి పేరుతొ ఖజానా నింపుకోవాలని ఇలా ఆస్తుల సర్వే పేరుతొ ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధ ఎల్ఆర్ఎస్ ను ప్రజలు ఎక్కడికక్కడ వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున పిలుపునిస్తున్నట్లు కవ్వంపల్లి పేర్కొన్నారు.

### పోలీసులు సామాన్యులకు స్నేహహస్తం అందిస్తూ

# నేరస్థులపాలిట సింహస్వప్నంగా నిలువాలి

### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, అక్టోబర్ 9 (నేటినిజం ప్రతినిధి): సామాన్యులకు స్నేహహస్తం అందిస్తూ నేరస్థులపాలిట సింహస్వప్నంగా పోలీసులు వ్యవహరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ఇతర ప్రభుత్వశాఖలతో పోల్చిచూసినట్లయితే ప్రజలకు నేరుగా సేవలందించే అత్యంతశక్తివంతమైన శాఖ పోలీస్ మాత్రమేనని పేర్కొన్నారు.

కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పిటిసి)లో శుక్రవారంనాడు తొమ్మిదినెలల శిక్షణ పూర్తి చేసుకున్న సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ళ పాసింగ్ అవుట్ పరేడ్(పివోపి)కార్యక్రమం జరిగింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాలరూపాల్లో చెల్లిస్తున్న పన్నులద్వారానే జీతభత్యాలను పొందుతున్నామని విషయాన్ని గుర్తించి పోలీస్‌శాఖలోని ప్రతిస్థాయి ఉద్యోగి ప్రజలసేవకు అంకితంకావాలన్నారు. ప్రజల ధన,మాన,ప్రాణాల రక్షణధ్యేయంగా ఏసమయంలో ప్రజలకు ఆపద వచ్చినా సత్వరం స్పందించి సేవలందించాలని చెప్పారు. ఏస్థాయిలోనైనా ఎలాంటి ఆపదవచ్చినా క్లిష్టసమయాల్లో పోలీసులనే ఆశ్రయిస్తారని, ఇంతటి గుర్తింపు ఏరకమైన శాఖకు లభించదని, మనంఅందించే సేవలతో ప్రజలమదిలో చిరస్థాయిగా నిలిచిపోతామనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. సమాజంలోని అందరిదృష్టి పోలీసులపైనే ఉంటుందని, క్రమశిక్షణతో మెదులుతూ అత్యుత్తమైన సేవలతో పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. ఈ ఉద్యోగం కేవలం ధేహదారుఢ్యంతోనే లభించలేదని, దీంతోపాటుగా వేలాది మందితో అన్నివిభాగాల్లో పోటీపడితేనే లభించదనే విషయం గుర్తించి, తమతో పోటీపడ్డవారందరిలో తామే సమర్థులమని నిర్ధారించుకోవాలని చెప్పారు. పిటిసి కి చెందిన అన్నిస్థాయిలకు అధికారులు, సిబ్బంది శిలలులాంటి మిమ్మల్ని శిల్పాలుగా తీర్చిదిద్దారని అభినందించారు. ప్రస్తుతం శిక్షణ పూర్తిచేసుకున్న పోలీసులు ఇంతటితో తమ శిక్షణ పూర్తికాలేదని, ఇంకా జీవితాంతం నేర్చుకునేది చాలాఉందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. నేర్చుకోవడం అనేది నిరంతరం కొనసాగించాలని, ఆపివేసినట్లయితే ఎదుగుదల నిలిచిపోతుందనే విషయాన్ని గుర్తించి నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సినిమాల్లో చూపే పోలీస్‌కు బయటి పోలీస్‌కు చాలాతేడా ఉంటుందని, ఇక్కడ ప్రతీది ప్రత్యక్ష్యంగా చేయాల్సివస్తుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ళు నిర్వహించిన దీక్షాంత్‌పరేడ్ మిలటరీ, న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే దినోత్సవం పరేడ్‌ను తలపింపజేసిందని అభినందించారు. పిటిసి ప్రిన్సిపాల్ వి సునీతమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంతపెద్దసంఖ్యలో పోలీసులు శిక్షణ పూర్తిచేసుకున్న ఏకైక శిక్షణకేంద్రం కరీంనగర్ పిటిసి అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి, ఇతర అధికారుల సహకారంతో ఊహించనిరీతిలో పిటిసి అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. 2010లో ప్రారంభమైన ఈ శిక్షణ కేంద్రంలో ట్రైనీ కానిస్టేబుళ్ళ శిక్షణ పూర్తవడం ఇది ఐదవసారి కాగా, వివిధ రకాల పదోన్నతులకు సంబంధించి 17బ్యాచ్‌లు ఇక్కడ శిక్షణను పూర్తిచేసుకున్నాయని వివరించారు.

దివంగత రాంవిలాస్ పాశ్వాన్ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.

## నివాళి అర్పించిన రాహుల్

న్యూఢిల్లీ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ):రాంవిలాస్ పాశ్వాన్ పార్థివదేహాన్ని సందర్శించిన రాహుల్ గాంధీ ఆయనకు నివాళి అర్పించారు. ఉదయం ఢిల్లీలోని పాశ్వాన్ నివాసానికి చేరుకున్న రాహుల్.. పాశ్వాన్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాన్ను

# తెలంగాణ ఆడపడుచులకు పెద్దన్న సీఎం కేసీఆర్

**-బతుకమ్మ పండుగ కానుకగా చీరలు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థం మాధవి**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9 (నేటినిజం ప్రతినిధి):పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణ ప్రజలది తెలంగాణ రాష్ట్రంలో పేద ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కే సి ఆర్ బతుకమ్మ చీరలను అందిస్తూ ఆడపడుచులకు పెద్దన్నగా మారా ర ని వేములవాడ మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థ పు మాధవి రాజు అన్నారు.శు క్రవారం వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడపడుచులకు బతుకమ్మ చీం లను శుక్రవారం పట్టణంలోని పద్మశాలి సంఘం , సుభాష్ నగర్ లో మున్సిపల్ చైర్మ న్ రామతీర్థం మాధవి రాజు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పేద ప్రజల అభ్యున్నతి , సంక్షేమం తో పాటు పేదింటి ఆడపడుచులకు బతుకమ్మ చీరలను 6 సంవత్సరాల కాలం నుండి అందజేయడం జరుగుతుంది అని అన్నారు .తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ సంస్కృతి ని ప్రపంచానికి చాటిచెప్పే విధంగా గొప్పగా బతుకమ్మ పండుగను నిర్వహించడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మధు రాజేందర్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్ మారం కుమార్ గోలి మహేష్ బింగి మహేష్ నరాల శేఖర్ అన్నారం ఉ మారాణి శ్రీనివాస్ , గూడూరు లక్ష్మీ మధు , జడల లక్ష్మి శ్రీనివాస్ కొండ పావని నరసయ్య ముప్పిడి సునంద శ్రీనివాస్,దివ్య శ్రీనివాస్ ,కవిత, లావణ్య పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు .

# బతుకమ్మ చీరల పంపిణీ తో మహిళల్లో ఆనందం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9 (నేటినిజం ప్రతినిధి):ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్య క్రమం మహిళల్లో ఆనందాన్ని పోతుందని వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు అన్నారు వేముల వాడ అర్బన్ మండలం మారుపాక గ్రామం లో శు క్రవారం సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ లో అతి పెద్ద పండుగ అయిన బతుకమ్మ పండుగకు ఆడబిడ్డలకు కానుకగా ముఖ్యమంత్రి కెసిఆర్ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చడం అభినందనీ యమన్నారు, వేములవా డ అర్బన్ మండలం లోని 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 సంవత్సరాలు పైబడి ఉన్న మహిళలకు చీరల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు, తెలంగాణలో చీరల పంపిణీ తో నేతన్నలకు ఉపాధితో పాటు మహిళలకు బతుకమ్మ కానుకగా రెండు కార్యక్రమాలు జరుగుతున్నా యన్నారు, ఈ కార్యక్రమంలో జెడ్ పి టి సి మ్యాకల రవి , వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉరిడి ప్రవీణ్ ఎంపీడీవో ఆనంద్ ,ఎల్ .పి .ఓ , వార్డు సభ్యులు,మహిళా సంఘం అధ్యక్షులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ప్రశ్నించే గొంతులను నొక్కివేయడం అప్రజాస్వామికం

**కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం అణిచి వేస్తుందని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆది శ్రీనివాస్ అన్నారు, శుక్రవారం ఆయన చందుర్తి లో మాట్లాడుతూ ఏఐసిసి కార్యదర్శి సంపత్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ,అనిల్ కుమార్ యాదవ్, వెంకట్ లతో పాటు 66 మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు మరియు హత్యల పై నిరసన తెలుపుతూ హోంమంత్రి గారిని కలవడానికి వెళ్తే అరెస్టులు చేసి కేసులు పెడతారా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో ఇంతటి ఘోరాలు జరుగుతుంటే నియంత్రించాల్సిన బాధ్యత మరిచిన ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడి మాట్లాడితే కూడా ఇలా అరెస్టులు చేసి కేసులు పెట్టడనీ సిగ్గుచేటన్నారు.

నిందితులు ఎంతటి వారైనా సరే చట్టపరంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటనను అలాగే నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.రాష్ట్రంలో రోజు రోజుకు నేరాల సంఖ్య పెరుగుతుందని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

దళిత మైనార్టీ బలహీన వర్గాల మహిళల, యువతులపై అత్యాచారాలు పెరగడం ఆందోళన కలిగించే అంశం అన్నారు,

కాంగ్రెస్ నేతలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కివేయడం సరికాదని ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు, ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు అంజన్ రావు, నేతికుంట జలపతి,అవారి రమేష్, దశరథం,కోరుట్ల చంద్రయ్య,మల్లారపు దేవరాజు,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో ముందున్న రఘునందన్ రావు

**ఈ సారైనా చట్టసభలో ప్రవేశించే అవకాశం దక్కేనా?**

సిద్దిపేట,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): గతంలో వరుసగా రెండు ఎన్నికలతో పాటు గత లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓటమి చవిచూసిన రఘునందన్ ఈసారి ఎలాగైన విజయం సాధించి తొలిసారి చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆతృతగా ఉన్నారు. దుబ్బాక అసెంబ్లీ స్థానంలో ముచ్చటగా మూడోసారి బరిలోకి దిగిన ఆయనకు ఉప ఎన్నిక ఎలాంటి ఫలితానిస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది. మొదటి నుంచి భారతీయ జనతా పార్టీ దుబ్బాక నియోజకవర్గంపై కన్నేసింది. ఇందులో భాగంగానే రెండు నెలలుగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు నియోజకవర్గంలో తిరుగుతూ ప్రచారం ప్రారంభించారు.అధికార టీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులతో పోల్చుకుంటే రఘునందన్ ప్రచారంలో ఓ అడుగు ముందే ఉన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుతో పాటు కేటీఆర్‌లపైనే ఆయన ప్రధానంగా విమర్శలు గుప్పిస్తున్నారు. సిద్దిపేట, సిరిసిల్లపై ఉన్న ప్రేమ టీఆర్ఎస్ నేతలకు దుబ్బాకపై లేదని, ప్రశ్నించే గొంతుకగా తనకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడే పోటీ చేసి ఓటమి చవిచూసిన తనపై ఈసారి దుబ్బాక ఓటర్లు సానూభూతి చూపిస్తారని, మొదటి సారి అసెంబ్లీలోఅడుగుపెట్టే అవకాశం దక్కడం ఖాయమని ఆశలు పెట్టుకున్నారు. దీంతో నామినేషన్ల స్వీకరణ, ప్రచార వ్యూహాలపై కసరత్తు ప్రారంభించారు. 9వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నామినేషన్ల ఘట్టానికి తెరలేచింది. ఎప్పుడు నామినేషన్ వేయాలి? ఎంత మందితో వేయాలి? నామినేషన్లు వేసే పక్రియకు ఎవరు హాజరు అవుతారు అనే విషయంపై అన్ని పార్టీల్లో చర్చ సాగుతోంది. అదేవిధంగా నామినేషన్ వేసిన తర్వాత ఇరువై రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఇప్పటి నుంచే ప్రచార వేగం పెంచారు. టీఆర్ఎస్ గెలుపు బాధ్యత భుజాన వేసుకున్న మంత్రి హరీశ్‌రావు రెండు రోజులుగా అభ్యర్థి సుజాతతో కలిసి ప్రచారంలో వేగం పెంచారు. బీజేపీ నుంచి రఘునందన్‌రావు ఒంటరి పోరాటం చేస్తూ ప్రచారం ముమ్మరం చేశారు. అధికార టీఆర్ఎస్ పార్టీ అందరికన్నా ముందుగా తమ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత పేరును ప్రకటించింది. బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు పేరును ఆ పార్టీ జాతీయ ఎన్నికల కమిటీ ప్రకటించింది. టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి ముత్యంరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి పేరును ఖరారు చేస్తూ ఏఐసీసీ ప్రకటన విడుదల చేశారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో నామినేషన్ల దాఖలు, ప్రచార వ్యూహాలపై నేతలు కసరత్తు ప్రారంభించారు.

# ఎసిబి కోర్టులో ఓటుకునోటు కేసు విచారణ

## తదుపరి విచారణ 12కు వాయిదా

హైదరాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసును ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణలో ఆడియో టేపుల ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ కీలకం కానుంది. తదుపరి విచారణను ఈ నెల 12కు కోర్టు వాయిదా వేసింది. 12 నుంచి రోజువారిగా విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. కాగా ఈ కేసులో కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటు పలువురు నిందితులుగా ఉన్న విషయం విదితమే. దేశంలోని ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులపై ఉన్న కేసులను సత్వరమే విచారణ జరపాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులపై ఉన్న కేసులను హైకోర్టు, సీబీఐ కోర్టులు విచారణను వేగవంతం చేశాయి.

# మానసిక రుగ్మతలకు మందు ప్రశాంత జీవనమే

**(10 అక్టోబర్ 'ప్రపంచ మనసిక ఆరోగ్య దినం' సందర్భంగా)**

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం జ్వరం లేకపోవడం మాత్రమే ఆరోగ్యం కాదని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంత ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులని వివరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌజన్యంతో ప్రతియేటా 10 అక్టోబర్ రోజున 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' పాటించడం ఆనవాయితీ వస్తున్నది. 1992లో ప్రారంభమైన ప్రపంచ మానసిక ఆరోగ్య దినం వేడుకల్లో భాగంగా విశ్వ మానవాళికి మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలపడం, మానసిక రుగ్మతలతో బాధ పడుతున్న వారికి చికిత్స అందించడం మరియు మానసిక వికాసానికి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుంది. కోవిడ్-19 విజృంభణతో మిలియన్ల విశ్వ మానవాళి మానసికంగా బలహీన పడుతున్నారు. కరోనా వైరస్ కన్న సోకుతుందేమో అనే భయంతో ఆత్మహత్యలు కూడా జరగడం వింటున్నాం. మానసిక దృఢత్వం కలిగిన వారు అనారోగ్యాల నుండి దూరంగా ఉంటారని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానసిక వ్యాధికి మందు లేదు అనే నానుడి మనందరికి తెలుసు. కరోనా వారియర్లుగా పేరొందిన వైద్యులు, నైటింగేల్ నర్సులు, పోలీసులు, పారిశుధ్య సిబ్బంది, ఉద్యోగులు, జిల్లా యంత్రాంగం నిరంతరం కరోనా రోగులకు అపార సేవలు అందిస్తూ, ఇంటికి వెళ్లడానికి, కుటుంబ సభ్యులతో గడపడానికి, వైరస్ సోకుతుందేమో అని భయపడుతున్నారు. ఇలాంటి నిస్వార్థసేవకులు మానసికంగా కృంగిపోయి అనారోగ్యం పాలు కావడం జరుగవచ్చు. జీవనోపాధికి బజారుకు వెళ్ళి కాయకష్టం చేసుకునే వారు కూడా నిత్యం భయం గప్పిట్లో జీవిస్తూ, మానసిక ఆందోళనకు గురౌతున్నారు. కరోనా సోకి క్వారంటైన్‌లో ఉండే వారు మానసిక దృఢత్వంతో ఉంటేనే తొందరగా కోలుకొంటారని వైద్యులు అంటున్నారు. ఔషధాలతో నయం కాని రోగాలు మానసిక ధైర్యంతో నయం అవుతాయని ప్రచారం చేయుట జరుగుతోంది. వ్యాధి కన్న భయం ప్రమాదకరమైందని గమనించాలి.

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మానసిక ఆరోగ్య సాధనకు దృష్టి సారించి, పలు జాగ్రత్తలు తీసుకోవలసిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి. భయం, ఒత్తిడి, ఉద్రేకం, నిరాశ, అధిక పని ఒత్తిడి, ఒంటరితనం, భావోద్వేగ ఆందోళనలు, కరోనా తెచ్చిన నవ్య జీవనశైలి లాంటివి మానసిక ఆరోగ్యానికి ప్రతిబంధకాలు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 450 మిలియన్లకు పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో సతమతమవుతున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 13 శాతం అనారోగ్యాలు మానసిక సంబంధమైనవిగా గుర్తించారు. ప్రపంచ స్థాయిలో మానసిక ఆందోళనలతో ఏడాదికి 8 లక్షల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, అసంఖ్యాకులు ఆత్మహత్యాయత్నం చేస్తున్నారని తేలింది. మానసిక బలహీనతలతో 79 శాతం ఆత్మహత్యలు దిగువ పేద మరియు మధ్య తరగతి కుటుంబాలలో నమోదవుతున్నాయి. ప్రపంచ ఆర్థిక సమాఖ్య అంచనాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానసిక సంక్షోభం స్థితి వచ్చిందని, అన్ని దేశాల్లో మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని, వీటిని తగ్గించడానికి 16 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక భారం పడుతుందని విశ్లేషించారు. విశ్వ ఆరోగ్య స్థాపనకు బహుముఖీన మానసిక ఆరోగ్య వికాస చర్యలు అవసరం అవుతాయని గుర్తించారు.

'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం-2020' నినాదంగా "అందరికీ మానసిక ఆరోగ్యం కోసం అధిక పెట్టుబడులు - అధిక అందుబాటు" తీసుకొని ముందుకు సాగుతున్నారు. శారీరక ఆరోగ్యానికి మానసిక దృఢత్వం తప్పనిసరి అని అందరం గమనించాలి. మానసిక ఆరోగ్యం ఒక రోజులో సాధించేది కాదని, మన జీవనశైలి మరియు ఆలోచనా విధానంతో దీర్ఘకాలిక జాగ్రత్తలతోనే సత్ఫలితాలు కనిపిస్తాయని అర్థం చేసుకోవాలి. మనసు విప్పి గలగల మాట్లాడడం, చలాకీగా ఉండడం, ప్రతి విషయాన్ని తేలికగా తీసుకోవడం, నవ్వటంతో పాటు నవ్వించడం, ప్రశాంతంగా నిద్ర పోవడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, సమయపాలన పాటించడం, శారీరక వ్యాయామానికి సమయమివ్వడం, మిత్రులతో సమస్యలను చర్చించడం, ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కోవడం లాంటి అలవాట్లతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని నమ్మాలి. మానసిక ఆరోగ్య పరిరక్షణకు సకారాత్మక అవగాహన కల్పించడం, కుటుంబ సభ్యులు పలు అంశాల్లో మనసు విప్పి మాట్లాడుకోవడం తప్పనిసరి. సమస్యలు లేని జీవితం లేదు. విఫలం కాని వీరుడు లేడు. కష్టాలు మనకు మాత్రమే రాలేదు. కష్టసుఖాల సంగమమైన జీవితంలో విజయంలో విర్రవీగక, అపజయంలో ఆందోళన పడక, మానసిక పరిపక్వతతో అడుగులు వేసిన వారిని మానసిక ఆరోగ్యం పరిస్తుందని తెలుసుకోవాలి. మానసిక ఆరోగ్యంతోనే పనిలో సఫలత సిద్ధిస్తుందని, అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, మానసిక ఆందోళన ప్రతికూల ఫలితాలను ఇస్తుందని తెలుసుకోవాలి. మానసిక ఆందోళనతో శారీరక సామర్థ్యం తగ్గుతుంది. శారీరక మానసిక ఆరోగ్యమే మనిషి ప్రగతికి తొలి మెట్టు అవుతుందని గట్టిగా నమ్ముదాం. మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని నినదిద్దాం.

**- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**
99497 00037

# దుబ్బాకలో కాంగ్రెస్‌కు ఊహించని షాక్

**పార్టీ ముఖ్య నేతలు టిఆర్ఎస్‌లో చేరిక**
**కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి హరీష్ రావు**
**దుబ్బాకకు తొలి మహిళా ఎమ్మెల్యే రాబోతున్నారని జోస్యం**
**సుజాత గెలుపును ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్య**

సిద్దిపేట,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉపఎన్నిక ముందు కాంగ్రెస్‌కు ఊహించని రీతిలో షాక్ తగిలింది. కాంగ్రెస్ నేతలు అయిన కోమటిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి, బొంపల్లి మనోహర్ రావు కాంగ్రెస్‌కు షాకిచ్చి కారెక్కారు. శుక్రవారం నాడు సిద్దిపేట పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల సమక్షంలో ఆ ఇద్దరూ గులాబీ కండువా కప్పుకున్నారు.

వారిద్దరికీ కండువా కప్పిన హరీష్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారు 2 వేల మంది అనుచరులతో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దుబ్బాకలో వెంకటనర్సింహారెడ్డి, మనోహర్ రెడ్డి టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత కాంగ్రెస్ ఖాళీ అయినట్టేనని జోస్యం చెప్పారు. ఊసరవెల్లి లాగా ఓట్లప్పుడు కాంగ్రెస్ నాయకులు వస్తారని.. ప్రతిపక్షపార్టీలకు పోయిన ఎన్నికల్లో వచ్చిన ఓట్లు కూడా రావని మంత్రి విమర్శలు గుప్పించారు. తెలంగాణలో 7 లక్షల పెళ్లిళ్లకు టీఆర్ఎస్ ప్రభుత్వం సహాయం చేసిందన్నారు. పంజాబ్, పాండిచ్చేరి, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడైనా కళ్యాణలక్ష్మీ ఇచ్చిందా..? అని హరీష్ ప్రశ్నించారు. తొలిసారిగా దుబ్బాకకు మహిళా ఎమ్మెల్యే కాబోతుందని.. మహిళా అభ్యర్థిగా సోలిపేట సుజాతను ఖరారు చేస్తే ఒక అసమర్థురాలు అని ఉత్తమ్ విమర్శించడం తగునా? అని మంత్రి హరీష్ ప్రశ్నించారు. నేతలు జారుకోవడంతో రోజురోజుకు ఆ పార్టీ బలహీనపడి పోతోందన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతకు భారీ మద్దతు వస్తుందని తెలిపారు. ఈ మద్దతు చూస్తుంటే సుజాత భారీ మెజార్టీతో గెలుస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. ఎన్నికల వరకే ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇక్కడ ఉంటాడు. కానీ తాము 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. కేవలం ఓట్ల కోసమే వచ్చే వాళ్లకు ఓట్లు వేద్దామా? ఇక్కడి ప్రజలతో కష్టసుఖాలు పాలు పంచుకునే వారికి ఓటేద్దామా? అని అడిగారు. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లు కూడా వస్తాయో.. రావో అని కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారు. దుబ్బాక మహిళా లోకాన్ని ఉత్తమ్ కించపరిచాడని ధ్వజమెత్తారు. తొలిసారి దుబ్బాక నియోజకవర్గానికి మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించబోతుందని అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి హరీష్ రావు తెలిపారు.

# భీమా కోరేగావ్ కేసులో 8మందిపై ఛార్జిషీటు

ముంబై,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ శుక్రవారం భీమా-కొరెగావ్ కేసులో ఎనిమిది మందిపై ఛార్జిషీటు దాఖలు చేసింది. 2018 జనవరి 1న హింసాత్మక సంఘటనలకు పాల్పడేవిధంగా ప్రజలను రెచ్చగొట్టడంలో వీరి ప్రమేయం ఉందని ఆరోపించింది. సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ హనీ బాబు, గిరిజన నేత ఫాదర్ స్టాన్ స్వామి తదితరుల పేర్లు ఈ ఛార్జిషీట్‌లో ఉన్నాయి. ఎన్ఐఏ అధికార ప్రతినిధి, పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) సోనియా నారంగ్ మాట్లాడుతూ, ఛార్జిషీటును కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. దర్యాప్తు సందర్భంగా ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పుణెళి సమీపంలోని కొరెగావ్ వద్ద యుద్ధం జరిగి 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2018 జనవరి 1న పెద్ద ఎత్తున కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హింసాత్మక సంఘటనలు జరిగే విధంగా నిందితులు రెచ్చగొట్టినట్లు ఎన్ఐఏ ఆరోపించింది. ఈ హింసాత్మక సంఘటనల్లో ఒకరు మరణించగా, చాలా మంది గాయపడ్డారు. ఎన్ఐఏ ఛార్జిషీటులో పేర్కొన్నవారిలో సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ హనీ బాబు, గిరిజన నేత ఫాదర్ స్టాన్ స్వామి, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబే, జ్యోతి జగతప్, సాగర్ గోర్కే, రమేశ్ గైచోర్, భీమా-కొరెగావ్ శౌర్య దిన్ ప్రేరణ అభియాన్ గ్రూప్ ఉద్యమకారులు.

ఈ కేసులో నిందితుల్లో ఒకరైన మిలింద్ తెల్తుంబే పరారీలో ఉన్నారు.

# కాంగ్రెస్,బిజెపిలకు డిపాజిట్ గల్లంతు

**-మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవిత భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీల డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఉ ప ఎన్నికకు పోలింగ్ పక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 824 ఓట్లు ఉండగా, అందులో 90 శాతం ఓట్లు కవితకే పడటం ఖాయమన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు, రైతులకు బాండ్లు పేపర్లు రాసిచ్చి మోసం చేసిన వ్యక్తిని గెలిపించి పొరపాటు చేశామని ఏడాది తర్వాత జిల్లా ప్రజలు గ్రహించారు అని పేర్కొన్నారు. బీజేపీ నేతల మాయమాటలకు మోసపోయామని పశ్చాత్తాపపడుతున్నారు. అందులో భాగంగా పార్టీలకు అతీతంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వారి పార్టీలను ధిక్కరించి వారి అంతరాత్మ ప్రబోధానుసారం కవితకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. నిజామాబాద్ జడ్పీ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తొలి ఓటు వేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే బిగాల గణేశిష్ గుప్తా, జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఆకుల లలిత, వీజీ గౌడ్, రాజేశ్వర్ తదితర 28 మంది టీఆర్ఎస్ నభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం టీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. వార్ వన్ సైడే ఉందని, కవిత గెలుపు ఖాయమన్నారు. ఆమె రాకతో రాజకీయాలు మారబోతున్నాయంటూ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరుగుతు న్నాయి. కవిత సునాయాసంగా విజయం సాధిస్తారు. ఉన్నత స్థాయిలోకి వెళ్తారు. నిజామాబాద్‌కు మళ్లీ మంచి రోజులు వస్తున్నాయని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గణేశిష్ గుప్తా అన్నారు.

# దాణా కేసులో లాలూకు బెయిల్

రాంచి,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్రమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు జార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాణా కుంభకోణానికి సంబంధించిన ఓ కేసులో జార్ఖండ్ హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. అయితే, లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పటికే దాణా కుంభకోణం కేసులో దోషిగా తేలి జైలుశిక్ష అనుభవిస్తున్నారు. మరోవైపు దుమ్కా ఖజానా కేసు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలో లాలూకు ప్రస్తుతం బెయిల్ మంజూరైనా జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం మాత్రం లేదు.

# బెంగాల్లో మమత సర్కార్ తీరు గర్హనీయం

**-కార్యకర్తలపై దాడిని ఖండించిన రవిశంకర్ ప్రసాద్**

న్యూఢిల్లీ,అక్టోబర్9(ఆర్ఎన్ఎ): పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో 'చలో నబన్నా' పేరిట బీజేపీ చేపట్టిన నిరసన ర్యాలీలో పాల్గొన్నవారిపై రసాయనాలతో కూడిన వాటర్ క్యానన్ ప్రయోగించినట్లు తన దృష్టికి వచ్చిందని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ ఆరోపించారు. అందుకే కొందరు వాంతులు చేసుకున్నారని, సుమారు 1500 మంది కార్యకర్తలు గాయపడ్డారని చెప్పారు. బెంగాల్ పోలీసులు వ్యవహరించిన తీరును బీజేపీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఆయన అన్నారు. పోలీసులు, లాఠీలను ప్రయోగించినంత మాత్రానా ఆ రాష్ట్రంలో బీజేపీ విస్తరణను నిలువరించడంలో సీఎం మమతా బెనర్జీ, టీఎంసీ విజయవంతం కాలేవని రవి శంకర్ ప్రసాద్ విమర్శించారు. బీజేపీ నేత హత్యకు నిరసనగా శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలపై నాటు బాంబులు, వాటర్ క్యానన్‌లు ప్రయోగించడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తప్పపట్టారు. మమతా అధికారానికి రోజులు దగ్గర పడటంతో ఆ నిరాశతోనే ఆమె ఇలా చేస్తున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు రసాయనాతో కూడిన వాటర్ క్యానన్‌లు ప్రయోగించారన్న కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ వ్యాఖ్యలను ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలపన్ బందోపాధ్యాయ ఖండించారు. ఎలాంటి రసాయనాలు వాడలేదని, ఇది తప్పుడు సమాచారమని తెలిపారు. నిరసనకారులను గుర్తించి అనంతరం వారిపై చర్యలు తీసుకునేందుకు వాటర్ క్యానన్ నీటిలో రంగు కలపడం ప్రపంచవ్య